# బాల వికాసం

## అందిన చందమామ

పల్లవి:- బడికెళ్ళాలమ్మా-నా బంగారు తల్లి
బాగా చదవాలమ్మా -నా గారాల చెల్లి
అక్షరమంటే-అర్థం కాని మాయ కాదని
నేర్చుకుంటే- అది అందిన చందమామని
చెప్పాలమ్మా-అక్షర భారతిని- చూడాలమ్మా

చరణం:- అమ్మ చెప్పిన మాటలే- తొలి అక్షరాలనీ
నాన్ననేర్పిన అడుగులే- మలి పుస్తకాలనీ
గురువు మప్పిన హితములో-జ్ఞాన మెంతో వుందని
ఆ జ్ఞానమే విద్యార్థికి-పూల బాటలేస్తుందని
పాటలో-కమ్మని రాగమేదో వుందని
వెన్నెల వెలుగులో- పుట్టిన భావమేదో వుందని
కూలిజనుల పనులతో -శ్రమ తత్వం వుందని
ఆ తత్వమే-మనిషికి-మనుగడ నిచ్చిందని
చెప్పాలమ్మా-అక్షర భారతిని-చూడాలమ్మా ॥బడి॥

చదువు సంధ్యలిచ్చే- సంతోషాలు
ఆటపాటలు పంచే ఆనందాలు
నీలో, తేలి, తేటలను-పెంచునని
అవే,నిత్యం నిను తీర్చి దిద్దే రాతలనీ
కదిలే కాలంలో- మార్పులెన్నో జరుగుననీ
చదివిన చదువే-నిను నడిపించుననీ
చెప్పాలమ్మా! అక్షర భారతిని-చూడాలమ్మా ॥బడి॥

అక్షరాన్ని, మనసుతో అందుకుంటే
ఆలోచనలెన్నో వికసించుననీ
అవే, నీకు, రేపటి దారి దీపాలనీ
ఎన్ని చదువులొచ్చినా- సంపదలెన్నున్నా
చదువుకున్న-మనిషి విలువ-వేరేనని
ఆ, విలువ-మిము- మేటిగా నిలిపేననీ
చదువు చెంతనుంటే
ఆకాశమే దిగివచ్చేననీ
చుక్కలన్నీ నీ వెంట నడిచేననీ
చెప్పాలమ్మా!
అక్షర భారతిని-చూడాలమ్మా ॥బడి॥



– బి. గోవర్ధనరావు
సెల్: 9441968930

## పచ్చదనం కోసం...

-అభినయ గేయం.

అంగన్వాడీ పిల్లలం !
అందమైన బాలలం!!

పచ్చదనం కోసం
మొక్కలను నాటుదాం!

గాలులన్నీ వీచేలా
చెట్లనెన్నో పెంచుదాం!!

మెరుపులన్నీ మెరిపించి
మేఘాలన్నీ కరిగిద్దాం!

చెరువులన్నీ పొర్లెలా
చినుకులన్నీ కురిపిద్దాం!!

వాగులన్నీ దొర్లెలా
వానలెన్నో రప్పిద్దాం!

పొలాలన్నీ దున్నేసి
విత్తనాలు చల్లేద్దాం!!

గాదెలన్నీ నిండెలా
పంటలెన్నో పండిద్దాం!

కరువులన్నీ తరిమేసి
కడుపునిండా భోంచేద్దాం!!



-రజిత కొండసాని

## బాల్యం

చెరువు కొలనులో కొట్టిన ఈత
మా అయ్య పెట్టిన వాత

ఆడిన ఓమనగుంతలు
వేసినాము ఎన్నో గంతులు

ఇసుకలో కట్టుకున్న గూడులు
అవే మాకు ఒకప్పటి గుడులు

పుస్తకంలో దాచుకున్న నెమలి ఈక
ఎప్పటికి మరవలేము మేమిక

వాన వరదలో వేసిన పడవలు
నాదే ముందు అని పడిన గొడవలు

చీమిడి ముక్కు చింతకాయ తొక్కు
వెక్కిరిస్తూ కొట్టుకునేవాళ్ళం తుక్కు తుక్కు

ఒకప్పటి బాల్యం
ఎప్పటికి అది అమూల్యం



-పి. కుమార్
8978631913

## బాల గేయం

### పి.వి.నరసింహారావు

మన రాష్ట్రానికి ముఖ్యమంత్రిగా
మన దేశానికి ప్రధాన మంత్రిగ
పరిపాలించిన "పీ.వీ"
పలు భాషలకో దీవి! ॥మన॥

'వరంగల్'లో జన్మించినా
'వంగర'లోనే పెరిగి
నిజాం నిరంకుశమెదిరించి
రాష్ట్రం బయటకు పయనించి
నాగపూర్‌లో ఉన్నత విద్యలు
న్యాయ శాస్త్రముల నభ్యసించి
రాజకీయ చాణక్యునిగా
రాజిల్లిన నరసింహారావు
ఆర్థిక సంస్కరణలకే ఆద్యుడు
భూ సంస్కరణలకూ బాధ్యుడు
'మైనారిటీ" ప్రభుత్వాన్నీ
మహా తెలివితో నడిపించి
సాంకేతికముగ 'ఐ.టీ'నెల్ల
స్వాగతించిన మాన్యుడు
తెలంగాణా మేధావిగా
తేజరిల్లిన ధన్యుడు.
॥మన॥



- డా॥ వడ్డేపల్లి కృష్ణ
9246541699



## పిల్లలం

పిల్లలం మేం పిడుగులం
ఆడిపాడే బుడుగులం
॥పిల్లలం॥

నింగి నేలకు నిచ్చనలేసి
పైకి, క్రిందికి ఊయ్యాలూగుతం
పరుగుల వరదై ఎక్కి దిగుతూ
జారుడు బండపై పల్టీ కొడుతం
॥పిల్లలం॥

ఊరు వాడ చెక్కర్లేసి
సయ్యాటల దాగుతూ వుంటాం
అడవి జంతువులతో పాటలు పాడి
పండ్లు,ఫలాలతో కడుపు నింపుతాం
॥పిల్లలం॥

క్రమశిక్షణతో బడికి వెళ్ళి
గురువుల చెంతన విద్య నేర్చుతాం
విజయాలెన్నో పొందుతూ సాగి
నవ భారతావనికి వారసులౌతాం
॥పిల్లలం॥



-ఉంద్రాళ్ళ రాజేశం
9966946084

## గాంధీజీ

గాంధీజీ బోసి నవ్వులమై
సమతా, మమతా పంచేస్తాం

గాంధీజీ చేతి కర్రలమై
స్వార్థం, ద్వేషం తరిమేస్తాం

గాంధీజీ కళ్ళజోడులమై
ముందు చూపుతో మెలిగేస్తాం

గాంధీజీ ఖద్దరు దుస్తులమై
అసత్యాన్ని పారద్రోలేస్తాం

గాంధీజీ చర్ఖాలమై
అహింసా మార్గం నడిపిస్తాం

గాంధీజీ చేతి పుస్తకమై
విజ్ఞానాన్ని అందిస్తాం

-కయ్యూరు బాలసుబ్రమణ్యం
7780277240

## మాకిష్టమంట

ట్రింగు ,ట్రింగుమను
సైకిల్ బెల్లు
టంగ్ ,టంగ్ మను
బడి గంట
మాకిష్టమంట

గల్ ,గల్ మను
కాలి గజ్జె
టప్ ,టప్ మను
వాన చినుకు
మాకిష్టమంట

జల ,జల పారు
ఏటి సెలయేరు
రివ్ ,రివ్ మను
గాలి హోరు
మాకిష్టమంట



-కయ్యూరు బాలసుబ్రమణ్యం
944179139

## డిజిటల్ చదువులు

మాసిన జుట్టు చిరిగిన బట్టలు
చెప్పులు లేని కాళ్ళు అర్థాకలి
సర్కారు బడికి వచ్చే పిల్లలు
చాలీచాలని గదులు
చెట్ల కింద క్లాసులు
ఒకటికి రెండుకు లేని ఏర్పాటు
తెలుగు మీడియం చదువులు

స్కూలు యూనిఫాం టై షూ
లంచ్ బాక్స్ పుస్తకాల సంచి
ప్రత్యేక వాహనంలో వచ్చిపోయే
ప్రైవేటు బడి పిల్లలు

పేద పిల్లలు ధనిక పిల్లలు
తెలుగు మీడియం ఇంగ్లీష్ మీడియం
ప్రభుత్వ విద్య ప్రైవేటు విద్య
చదువుల్లో నేడున్న అసమానతలు
నినాదాల్లోనే కామన్ విద్య

తరగతి గదిలో పిల్లలు టీచర్
ఎదురెదురుగా ఉండి క్లాసు బోధన
అర్థ మయ్యిందో లేదో తెలుసుకొని
సందేహాలు తీర్చే టీచర్
పిల్లలు టీచర్ చర్చించుకొనే వేదిక క్లాసురూము
ఇకపై ఆన్లైన్ క్లాసుకు అలవాటు

కరోనా తెచ్చిన డిజిటల్ చదువులు
స్మార్ట్ ఫోన్ ట్యాబు టీవి
ల్యాప్ టాప్ కంప్యూటర్లో
ఆన్లైన్ చదువులు
ఇప్పటికీ నల్లబల్లపై బోధన
అరుదుగా ఒఅఆ ప్రొజెక్టర్ పై క్లాసు
అధిక బ్యాండ్ విడ్త్ ఉన్న నెట్టు
నెట్టు సిగ్నల్ నిరంతర విద్యుత్
ఉంటేనే ఆ క్లాసు వినొచ్చు

సాంకేతికతకు అలవాటైన ప్రవేట్ సంస్థలు
ఇదివరకే క్లాసులు పరీక్షల నిర్వహణ
ఇకపై మరింత వేగంగా ముందుకు
తల్లితండ్రులపై డిజిటల్ భారం

ప్రవేటులో ఆన్ లైన్ క్లాసుల ప్రారంభం
పిల్లలు ఆన్ లైన్ క్లాసులే వింటున్నారా ..
విడియో గేములు చూస్తున్నారా..
ఏమి చేస్తున్నారో ఎవరికెరుక
ఐనా గంటల తరబడి వినగలరా
క్లాసు రూముకు ప్రత్యామ్నాయ మౌనా
ఈ డిజిటల్ చదువులు

గ్రామీణ పట్టణ పేద పిల్లలు
స్మా ర్టులు ట్యాబులు కొని
ఆన్ లైన్ క్లాసు వినగలరా
కొనలేని వారు చదువే మానేస్తారా
చూడాలి కాలమే సమాధానం
పెరగనున్న డిజిటల్ అసమానతలు

-సత్యం
సెల్.9666497998



## బాల్యం

గోలికాయ లాడుతూ
గొడవపడిన రోజులు
బంతులాటలాడుతూ
కొట్టుకున్న రోజులు
జారుడు బండ జారుతూ
లాగు చిరిగి నవ్విన రోజులు
బాల్యం గుర్తుకు వస్తే బలేగుంది.

దొంగా పోలీస్ ఆడుతూ
తెగువ చూపిన రోజులు
ముట్టిచుకునుడు ఆడుతూ
దొరకగానే మురిసిన రోజులు
దొంగిలించిన జామకాయను
కాకెంగిలిచేసి తిన్న రోజులు
బాల్యం గుర్తుకు వస్తే బలేగుంది.

కాగితాల పడవలు చేసి
వర్షంలో గంతులేసిన రోజులు
మోటబావిలో దోస్తులతో
మునకలేసిన రోజులు
కర్రాబిల్ల ఆడుతూ
కలిసి కేరింతలు పెట్టిన రోజులు
బాల్యం గుర్తుకువస్తే బలేగుంది.



- పి.వి. భైరవన్ శర్మ
సెల్: 8367524003

---

## నాన్న మొగ్గలు...

సమాజం ముసుగును చుట్టేసుకున్న
పితృస్వామ్యతాత నాన్నగారి నాన్నగారు
జీవితానికి నాన్నంటే భద్రత భరోసా

కంటి చూపు నియంత్రణతో భయపెట్టే
అధికార గౌరవపూర్వక నాన్న మా నాన్నగారు
భయం భక్తులను నేర్పించిన నాన్నంటే నాన్నే

గుండె ధైర్యాన్ని సంపూర్ణ స్వేచ్ఛనిస్తున్న
స్నేహ పూర్వక నాన్న మా పిల్లల నాన్నగారు
పిల్లల విజయానికి నాందీ ప్రస్తావన నాన్న

నాన్నగారి పేరును విలువను వాడుకోకుండానే
పిల్లలు ప్రభావితమై వారి వృత్తిని చేపడుతారు
ఇష్టమైన వృత్తిని చేపట్టుట నాన్న పెట్టిన భిక్ష

ఆడంబరాలు లేకుండా శ్రమ పడి జీవించే
మధ్య తరగతి జీవితాన్ని నేర్పించారు
కుటుంబానికి వెన్నెముక కష్టజీవి కర్మయోగి నాన్న

-శ్రీమతి. శాంతారెడ్డి
800817732

## నాన్న

విశ్వమంత ప్రేమను మదిలో దాచి,
గంభీర వదనంతో కన్నులలో వెన్నెల పూయిస్తూ....
ముసి ,ముసి నవ్వులను పెదవి
వెనకాల దాచే ...
మేరు నగధీరుడుగా కనిపించే నాన్న .

అలసిన అమ్మకు విశ్రాంతి నిస్తూ ...
బుజ్జాయి లేలేత బుగ్గల సుతారంగా తాకుతూ ..
తన ప్రతిరూపాన్ని పువ్వోలే చూసుకొని
మనసు మందిరం లో మమతలందించే నాన్న.

వెన్నంటి వుంటూ ... వేలుపట్టి నడిపిస్తూ ...
ప్రకృతిలా కాపాడుతూ ...
తన్నుతాను మరచి
తనువంతా పులకరించ
సంబరాల సంతకంతో
మునిగి తేలేనాన్న.

కష్ట, నష్టాలను కమనీయంగా భరిస్తూ ...
సంసార నౌకను సాఫీగా నడిపిస్తు..
చెట్టులా చేయూతనిస్తు ..
ఇంటికి ఎనగర్రలా...
అందరికి వెన్నెముకగా నిలిచి
ఎద సంబరాల నందించే నాన్న.త

ముద్దు ముద్దు మాటల ముత్యాల మూటల
చిన్నారులను మురిపెంగా చూసుకుంటూ ..
జీవిత పరమార్థాన్ని గెలిచే
ఆనంద సంతసాలలోమునిగి తేలే నాన్న.



-డా॥ బండారి సుజాత
9959771228

## ప్రేమమూర్తి??

పసిపాపల బోసినవ్వుల
ముద్దు మాటకు మురిసిపోయి
నునులేత పాదాలు
తన గుండెను తడమగ
ఎదలోని ప్రేమను
ఎదర పరచిన ప్రేమమూర్తి..
నాన్న !

ఆటపాటల, చదువుసంధ్యల
చిన్నారి చిట్టి గెలుపును
ప్రపంచానికి టముకు వేసి
ఆ గెలుపులో తన కష్టం
మరచిపోయే అల్పజీవి..!

చిటికెన వ్రేలు బట్టి
బతుకుదారి చూపిన మార్గదర్శి..
తన భుజాల పైనుంచి
లోకాన్ని చూపించిన దుర్భిణి..

కడుపు నిండా ఉన్న ప్రేమను
కళ్ళ వెనకాల దాచేసి
మనసు నిండిన మమకారాన్ని
మౌనం దాపున పాతేసి
మాటలకు గాంభీర్యం తొడిగి
మంచి చెడుల మర్మం తెలిపిన
మర్మయోగి..

మన బతుకుల భారాన్ని
తన భుజాలపై మోసి
తన కండ్ల నిండా
మన కలలే నింపుకొని
చిప్పిళ్ళే కన్నీళ్లను
స్వేదధారగా మార్చి
ఆశల సేద్యం చేసే కర్మయోగి..!

ఓటమికి కృంగిన వేళ
వెన్నుతట్టే ఓదార్పు..
నిస్తేజమై నీరసించగ
నిలబెట్టే నిండు ధైర్యం ...
ఒంటరిగా మిగిలిన లోకంలో
నడిపించి, గెలిపించే సైన్యం..

అమ్మను దేవత ను చేసి
తలచుకునే ప్రపంచంలో
ఒంటరై మిగిలిన వైరాగి..

గుండెల్లో పెట్టుకున్న పిల్లలే
గుండెలపై తన్ని గునపాలు దించినా
పండిన తన ప్రాయాన్ని మరచి
క్షేమమడిగే క్షమామూర్తి..!

-మధుకర్ రావు బోగెల్లి
9491318502

## అనుభవాల కథ-నాన్నంటే

చిరునవ్వుల ముసుగులో బాధలను దాచుకుని..
రెక్కలుముక్కలైనా వెరవక
మన వెన్నుతట్టు ధైర్యమే నాన్నంటే

సమాజంలో పిల్లల ఉనికికి చిరునామే తానై
మన ఆకలి తీరిన ఆనందంలో
తన ఆకలిని మరిచి నిస్వార్ధ మెతుకే నాన్నంటే

అవరోధాల నిచ్చెన మెట్లపై
విజయపు అడుగులు వేయించే చిటికెన వేలే నాన్నంటే

అనురాగపు పాటయై...అనుభవాల కథయై,
చదువు నేర్పే పాఠమై..దిశానిర్దేశపు
వెలుగై పూదోటల మార్గమై..మరుపురాని చరిత్రై
ఆయన గొప్పదనం తెలుసుకునేలోగానే
మింటచుక్కై మిగిలిపోయేవాడే నాన్నంటే...

నాన్న గుండె ఇల్లంత ఆయన కన్నులు ఒళ్ళంతా
వాటి నుండి తన ప్రతిరూపాలుగా పిల్లల్నే పొదువుకుని
భవిష్యత్తు వేదికపై హుందాగా నిలబెట్టేవాడే నాన్నంటే ...

పిల్లల మొహంలో సంతోషపు మతాబులు పూయించేందుకు
కష్టాలకొలిమిలో నిలువెల్లా కరిగిపోయే కొవ్వొత్తే నాన్నంటే -రమాదేవి బాలబోయిన
6281216735



## నాన్న మొగ్గులు

నిత్యం కుటుంబ బరువుబాధ్యతలు మోస్తున్నా
కాలంతో కష్టాల కడలిని దాటే బతుకునావికుడు
అలుపెరుగని నిత్యపోరాటయోధుడు నాన్న

అనునిత్యం కుటుంబరక్షణకై పాటుపడుతూనే
తాను ఒక సూర్యుడై కుటుంబానికి వెలుగవుతాడు
కుటుంబ పోషణలో ఆకాశమంతా అండా నాన్న

బిడ్డల ఆశయాలను నెరవేర్చడానికి సాధకుడవుతూ
వెన్నుదన్నుగా నిలిచి ధైర్యాన్ని ఇస్తున్న భరోసా
బిడ్డల మనుగడకు వెలుగునిచ్చే బాటసారి నాన్న

అహర్నిశలు కాయకష్టంతో పొట్టకూటి కోసం
చెమట చుక్కలను చిందించిన శ్రమైకజీవి నాన్న

తన కష్టాలను రంగరించి తినే కూడవుతాడు నాన్న

బిడ్డల్ని ప్రయోజకులుగా తీర్చిదిద్దే వరకూ
కంటికిరెప్పలా భరోసాగా అన్నీతానై తోడూ నీడవుతాడు
బాధ్యతలను ఒంటిస్తంభంలా మోస్తున్న ఆసరానాన్న

తన సంపాదనంతా కుటుంబానికే వెచ్చిస్తూనే
బంగారుభవితకు బాటలు వేస్తుంటాడు
పిల్లల భవిష్యత్తుకు మార్గదర్శిగా నాన్నే స్ఫూర్తిసంతకం
(అంతర్జాతీయ పితృ దినోత్సవ సందర్భంగా....)

-కొలిపాక శ్రీనివాస్
9866514972

## నాన్న ఎవరు..?

మన కలల్ని నెరవేర్చుటకై
మన భవితల్ని నిర్మించుటకై
తన ఆశలని కరిగించుకుంటూ
తన అలుపెరగని రెక్కలతో
మనకై శ్రమించే
మన సుఖాలకై పరితపించే
మెరిసే
ఆ స్వేదజలాల సీతాకోకే నాన్న.



-కవిశ్రీ
9493785596.

## మాతృదేవత

ఆమె నెత్తురు చనుబాలై నీకు సత్తువ నిచ్చు
ఆమె సహనం కొండంతై నిను బుజ్జగించు

ఆకలైతే గొంతులో పిలుపు అమ్మ
గాయమైతే గుండెలో అరుపు అమ్మ

ఏ కష్టమొచ్చినా చెప్పుకునేది అమ్మకే
అమ్మ అన్నీ తీరుస్తుందనే నమ్మకం
నీకు జన్మనివ్వడానికి చచ్చిబతికేది అమ్మ

ఏవగింపు నెరుగని ఆ అమృత హస్తాలు
నీ గురు లఘు శంకల ప్రక్షాళించు సేవా వాహినులు

ఈరేడు లోకాల ఏ భీతి లేని చోటు అమ్మఒడి
ఆ ఒడి ఆమె చల్లని చూపులు వెల్లి విరిసిన గుడి

ఆమె చూపించే గారాబం నూరుళ్ళ జీవితానికి ఆశీర్వాదం
ఆమె ప్రకటించే మమకారం బంగారు భవితకు ప్రాకారం

తప్పుచేసి నీవెవరి ముందూ తలదించుకోరాదని
వీపు మీద దెబ్బై నేర్పుతుంది వివేకాన్ని
చెంప మీద చరుపై మాన్పుతుంది చెడు గుణాన్ని

ఆ కన్నుల వెలుగొందు కలల నీవై కాంతి నీవే
ఆమె చెప్పిన కమ్మని మాటలు
ఆనంద జీవితానికి పూల బాటలు

అమ్మ దయ ఉంటే ఏ భయమూ లేదు
అమ్మ దీవిస్తే అందుకోని విజయం లేదు.

మంచితనముతో పేరు తెచ్చిన పరవశించు తల్లి హృదయం
తల్లిని సేవించిన భాగ్యమే తరగని సిరులకు మహోదయం
అందుకే మానవజాతి అయ్యింది మాతృదేవత.

- చిరమన వెంకట రమణయ్య
9441380336

## భవిష్యత్తుకు భరోసా నాన్న

నడక నేర్పేది నాన్న
నడత నేర్పేది నాన్న
భవిష్యత్తుకు భరోసా
మనకు చేయూత నాన్న

తెలియని కన్నీరుతో
కనిపించని ప్రేమతో
మనల్ని కనిపెట్టును
మదినిండా ప్రేమతో

ఆత్మీయతను పంచును
స్ఫూర్తినెంతో నిచ్చును
గెలుపుఓటములలో
మన వెన్నంటి ఉండును

తన కోపం క్షణకాలము
తన తపన ఎల్లకాలము
మన ఆశయం కొరకు
తన త్యాగం చిరకాలము

ఆదర్శ జీవితంతో
కుటుంబంపై ప్రేమతో
అండగా నిలుచును నాన్న
అంబరమంత మనసుతో



- కందుకూరి భాస్కర్
9703487088

## ఒకటే మాట ......

బ్రహ్మ పోసిన ప్రాణం
అమ్మ ఇచ్చిన జన్మ
నేడు భయం గుప్పిట్లో
గడప దాటలేకున్నది
డాక్టర్లే దేవుళ్ళై అడ్డునిలిచి
యమపురికి అడ్డగోడలైనారు
కనిపించని శత్రువు సంచరిస్తున్నవేళ
అణువణువున జన సంచారమై
వీధుల్లో గునపాలు దింపుతుంది
సూది మందుకే చతికిలబడే చర్మం
ఐసోలేషన్ వైపు అడుగేస్తుండే
ఎన్ని చెప్పిన ఎంత చెప్పినా
నివురు గప్పిన నిప్పులా చుట్టుకుంది కరోనా
ఇంట్లో వున్నా పిలిచి పలుకరించబోతుంది
లక్షలు దాటిన లక్షణాలు వీధుల్లో విహరిస్తుంటే
ఆదుకునే నాథుడెక్కడున్నాడు
అహర్నిశలు అడుగుల చప్పుడేలా?
అప్పుడైనా ఇప్పుడైనా ఒకటే మాట
కష్టమైనా నష్టమైనా ఓర్చుకోని
ఇంట్లోనే వుండి, ఇంటిల్లి పాది కాపాడుకో



-ఉంద్రాళ్ళ రాజేశం
9966946084

## తెగిన గాలిపటం!!

అమ్మ జన్మనిస్తే
నాన్న ఆ జన్మకు సార్థకత చేకూర్చుతాడు
మనకు నడక నేర్పి
నడవడికను సరిదిద్దుతాడు
తన భుజాలమీద ఎత్తుకుని
అందుకోవాల్సిన శిఖరాల
అంచులను చిన్నప్పుడే చూపుతాడు!

ఓటమిని ఓడించడమెలాగో
విజయాలను పాదాక్రాంతం
ఎలా చేసుకోవాలో నేర్పుతాడు
ఓర్పు మనిషిలో ఎంతటి
మార్పు తెస్తుందో చెప్పడానికి
తానే ఒక పాఠంగా మారుతాడు!

మన ప్రగతికి తొలిమెట్టుగా నిలిచి
ఎక్కిన మెట్లను మరిచిపోయిన
సంతానాన్ని మౌనంగా క్షమిస్తాడు!
బాధను గుండెల్లో దాచుకొని
తబాధ్యతను భుజాన వేసుకుని
బిడ్డల జీవితాలకు వెలుగుబాట పరుస్తాడు!!
పిల్లల ఆశల గాలిపటాలకు
దారమై నిలిచిన నాన్న
వృద్ధాప్యంలో అధారం దొరక్క
తెగిన గాలిపటమై
ఎండిన ఏ కొమ్మకో రెపరెపలాడతాడు!!



-అనిత దావత్
9394221927

నేటినిజం

# సాహితీ కెరటాలు

E-mail : netinijam93@gmail.com website: www.netinijam.com

గురువారం 2-7-2020 ఎడిటర్: బైస దేవదాస్: సెల్:9000065433 హైదరాబాద్ 3


## నమ్మలేని నిజాలు

చెప్పి రానిది
మరణం ఒక దశ
మేలె మిగులు

వీరుడి మరణం
కోట్ల జనంలో దుఃఖం
తిరంగ సలాం

కులవృత్తులు
పాడు పడ్డ బావులు
పునర్నిర్మాణం

జలపాతాలు
అడవి ప్రతిబింబాలు
ఋతు సోయగం

సూర్య గ్రహణం
నాస్తికాస్తిక పోరు
సత్య శోధన



– రేడియమ్
సెల్: 9291527757

## శ్రీనిజాలు

టెస్టుల్లో పాజిటివే
పెరుగుతుంటె పెక్కు !
దిక్కు ఏది లేకుంటే
లాక్ డౌనే దిక్కు !

తిరుగుతుంటె దూరుతుంది
కరోనా ఒంట్లో !
కాలు బయట పెట్టకుండ
పొదగండి ఇంట్లో !



– కందుకూరి శ్రీరాములు
సెల్:9440119245

## ఓ తండ్రి వేదన



-అత్తలూరి విజయలక్ష్మి
9676881080

ఆనాడు ఆర్మీలో చేరు బాబూ అనగానే
నా వంక చూసిన నీ కళ్ళల్లో లిప్తపాటు కదిలిన
భావాలు నా కంట పడకుండా నీ కంటి రెప్పలు
అడ్డుపడినాయి
అవును, కాదు అన్నట్టు అడ్డంగా ఊపిన
నీ తల నాకు అంగీకారానికి, అనంగీకారానికి
తేడా చెప్పలేదు
నీ మనసేంటో, ఆ మనసులో దాచుకున్న
కోరికలేంటో తెలుసుకోకుండానే
అన్నిటినీ కట్టగట్టి నీ చంకన పెట్టి,
బండెక్కించా
ఎట్లా ఉన్నావురా అని ఫోన్ చేసానేకాని
ఎక్కడ ఉన్నావురా అని అడగలేదు
నాకేం తెలుసు కొండల్లో, కోనల్లో,
లోయల్లో, నదుల్లో, గుహల్లో, గుడారాల్లో
ఎక్కడంటే అక్కడ ఉండాలని
ఎక్కడ ఉన్నా ఒళ్ళంతా కళ్ళు చేసుకుని
దేశాన్ని కాపలా కాయాలని...
నాకేం తెలుసు నీ ప్రాణాలు అరచేతుల్లో పెట్టుకుని
మా ప్రాణాలు కాపాడడానికి అనుక్షణం
అప్రమత్తంగా ఉండాలని
నాకేం తెలుసు నువ్వు తిన్నా, తినకున్నా,
కన్ను మూసినా, కలలన్నీ అణచిపెట్టి అరమోడ్పు
కళ్ళతో నిత్యం జాగృతిలో ఉండాలని
నాకేం తెలుసు నీ గుండె గుళ్ళకి అడ్డుపెట్టి
మా గుండెల సడి ఆగకుండా చూడాలని
తెలిసిందల్లా ఒక్కటే
నా బంధుమిత్రుల్లో, పరిచయస్తుల్లో
గొప్ప తండ్రిగా నేనుండాలని
నా కోరిక నెరవేర్చిన కొడుకువు నువ్వు కావాలని
ఇప్పుడు తెలిసింది నాన్నా! నువ్వు గొప్ప కొడుకువి
మాత్రమే కాదు ..
సమస్త లోకానికి సర్వం అయావు
అమరుడవై రేపటి భారతాన్ని లిఖించే
వ్యాసుడవు అయావు
మరణించి మనిషి, మనిషి కన్నీటి బిందువుల్లో కలిసి
జీవనదివైనావు ....
నేను మాత్రం బతికుండగానే శిలనైనాను
ఘనీభవించిన కన్నీటి సంద్రమయ్యాను.

## నాయకుడు

అందరినీ అండగా నిలిచాడు
ఒకప్పటి నాయకుడు!
కులోపకులాలుగా
కుంచించుకుపోతున్నాడు
ఇప్పటి నాయకుడు.

-రఘువర్మ
సెల్: 9290093933




వాసా ఫౌండేషన్
మరియు
నేటినిజం దినపత్రిక
సంయుక్త ఆధ్వర్యంలో



ప్రముఖ రచయిత్రి డాక్టర్ వాసా ప్రభావతి
స్మారక కవితల పోటీలు
కరోనా మహమ్మారి విజృంబన నేపథ్యంలో
ప్రజలెదుర్కొంటున్న అనేకానేక సమస్యలపై దృష్టి సారించి
"వలస కార్మికులు"
అన్న అంశం మీద మీ కవితాస్త్రాల్ని సంధించండి

బహుమతుల వివరాలు:

- మొదటి బహుమతి : రూ.5000/- జ్ఞాపిక, ప్రశంసాపత్రం
- రెండవ బహుమతి : రూ.2,500/- జ్ఞాపిక, ప్రశంసాపత్రం
- తృతీయ బహుమతి : రూ.1,000/- జ్ఞాపిక, ప్రశంసాపత్రం
- 10 ప్రోత్సాహక బహుమతులు: రూ.500/- జ్ఞాపిక, ప్రశంసాపత్రం

పాల్గొన్న ప్రతి ఒక్కరికీ ప్రశంసాపత్రం

బహుమతులు గెలుచుకున్న కవితలతో పాటు ప్రచురణకు ఎంపికచేసిన కవితలను 'నేటినిజం'లో ప్రచురించబడును.

నిబంధనలు:
1) కవిత 25 లైన్లకు మించకూడదు.
2) వలస కార్మికుల సమస్యలపైనే ఉండాలి.
3) అనువాద కవితలు పోటీకి అంగీకరించబడవు
4) కవితను ఏ పత్రికకు పంపలేదని, సోషల్ మీడియాలో పోస్ట్ చేయలేదని ఈ పోటీ నిమిత్తమే రాసినదని హామీ తప్పక జత చేయాలి.
5) హామీ పత్రంతో మీ పేరు, ఫోటో, పూర్తి చిరునామా తప్పని సరి.
6) ఒకరు ఒక కవితను మాత్రమే పంపవలెను.

కవితలు పంపవలసిన చిరునామా:
'నేటినిజం' దినపత్రిక, ఎస్.ఆర్.టి-74, జవహర్‌నగర్, హైదరాబాద్-20.
E-mail : netinizam2020@gmail.com
కవితలు పంపాల్సిన చివరి తేది : 15-7-2020


# ప్రక్కదేశం అసహనానికి ప్రతీక కరోనా

శరీరం అదుపుతప్పే విషయాన్ని శరీరావయవాలు ముందుగానే సూచిస్తాయి. వాహనం అదుపుతప్పే విషయాన్ని యంత్రభాగాల్లో ఏదో ఒకటి సూచిస్తుంది. దేశం గాడి తప్పే విషయాన్ని దేశ పరిస్థితులు ముందుగానే సూచిస్తాయి. అట్లే ప్రపంచం ఎదుర్కొబోయే విపత్తులను సైతం ప్రపంచంలో జరిగే పరిణామాలు ముందుగానే తెలియజేస్తాయి.

'కరోనా' వ్యాపించి మానవహరణం చేస్తున్నప్పుడు పై విషయాలను గూర్చి చెప్పవలసిన అవసరం ఏర్పడ్డది.

సముద్రంలో ఉప్పెన రావడానికి ముందు మరీ ప్రశాంతంగా ఉంటుందనేది సత్యం. ఒక వ్యక్తి మౌనంగా ఉన్నాడంటే, వాడివల్ల ఏదో ఘోరం జరుగబోతుందన్న మాట.

కరోనా పుట్టుకకు, వ్యాప్తికి, ఒక దేశం కారణం కావడం ప్రత్యక్షంగా చూస్తున్నాం. దేశాల మధ్య, జాతుల మధ్య, మతాలమధ్య గల విద్వేషాలే మారణ హోమాలకు కారణభూతాలౌతాయనేది చారిత్రక సత్యం.

భారత అమెరికాలు ఒక బాటలో నడవడం కొన్నిదేశాలకు కడుపుమంట రగిల్చాయి. హైందవం, క్రైస్తవం ఒకటైతే మాగతేమిటని ఆ కొన్ని దేశాలకు అనుమానం కల్గింది. అమెరికా, భారత్ పంథాలో ఇస్లామిక్ టెర్రరిజానికి వ్యతిరేకంగా బహిరంగ ప్రకటన చేసింది. భారతదేశారికి ప్రక్కలో బల్లెంలాగా ఉన్న దేశానికి ఇది పూర్తిగా నచ్చలేదు. 'జిహాద్' పేరుతో భారత దేశ సంస్కృతిని ధ్వంసం చేయడానికి ప్రక్కదేశం చేయరాని పనులు చేస్తుంది.

మన దేశం నుంచి వేరైన దేశం మనకు వ్యతిరేకంగా పుట్టినప్పటి నుంచి కత్తులు దూస్తూనే వుంది. దానికి ఆ ప్రక్కనే ఉన్న చీనాదేశం వత్తాసుపలుకుతుంది. వాణిజ్య ప్రయోజనాలను దృష్టిలో పెట్టుకొని కమ్యూనిస్టు దేశం ఇస్లామిక్ టెర్రరిజానికి అడ్డుకట్ట వేయలేక పోయింది.

భారత్ ఇటీవల కాలంలో కాశ్మీరు సమస్యను పరిష్కరించుకోవడమే కాక, భారత పౌరులు కాని వారిని అనుమతిలేకుండా భారత దేశంలో ప్రవేశింపజేయని చట్టం తీసుకొని వచ్చింది. ప్రక్క దేశానికి ఇది పూర్తిగా మింగుడుపడలేదు.



ప్రత్యేకించి భారత్ అమెరికా అధినేతలు మంచి స్నేహితులయ్యారు. ఇది మన ప్రక్కదేశాలకు కంటిగింపుగా మారింది. ఒక విధంగా భారత్‌ను, దాన్ని సమర్ధించే దేశాలను నష్టపరచడానికి అంతర్జాతీయంగా ఒక కుట్ర జరిగింది. దాని పేరే 'కరోనా'. దాన్ని సృష్టించిన వారు ఏమి సాధిస్తారో గాని, ప్రపంచ విదేశాలకే ఒడిగట్టారు.

ఇంతవరకు భూమి పుట్టినప్పటి నుంచి, పుట్టిన క్రిముల గురించి తెలియబడకుండా ఉండలేదు. కరోనా సహజంగా పుట్టిన క్రిమియా? లేక కృత్రిమంగా తయారుచేసిందా అనే ప్రశ్న ఇంకా మన మెదళ్లను తొలుస్తూనే ఉంది.

సహజమైంది ఐతే అది భగవంతుని సృష్టి అవుతుంది. కాకపోతే అది మానవ సృష్టే. మనిషి వైజ్ఞానికంగా సాధించిన విజయాలకు గొడ్డలి పెట్టుగా మారింది కరోనా. దాన్ని కావాలని సృష్టించి వదిలిపెట్టింది. ప్రపంచ శాంతిని భగ్నం చేయాలనుకున్న దేశం. తనకు తానుగా ముందు జాగ్రత్తలు తీసుకున్నది. కరోనా చేసే కరాళ నృత్యాన్ని, సృష్టిస్తున్న విలయాన్ని కళ్లారా చూసి ఆనందించే దేశం ఒకటి భూమి మీద ఉందంటే, మానవత్వం తలదించుకోవలసిందే.

ఏమిటీ వైపరీత్యం! ఈ విపత్తు ఇంకా ఎన్నాళు కొనసాగుతుంది? కార్మికులకు చింత, ధార్మికులకు చింత. మందును కనుగొనజాలక విజ్ఞాన ప్రయోగశాలలు చిన్నబోతున్నాయి. మంత్ర తంత్ర గ్రంథాలు చేతులు ముడుచుకున్నాయి. ఎవరూ మాట్లాడలేని పరిస్థితి, చూడలేని పరిస్థితి, కలవలేని పరిస్థితి, చివరికి నాగరికులకు జీవించలేని పరిస్థితి, సామాన్యులకు జీవన పోరాటం.

నాగరిక ప్రపంచంలో ఉండి కూడా తోటి మానవుణ్ణి ప్రేమించలేని స్థితి దాపురించింది. జాతుల మధ్య వైరాలు మతాల మధ్య విద్వేషాలు, దేశాల మధ్య ఆధిపత్యాలు కరోనా సృష్టికి కారణమయ్యాయంటే, మనిషి ఇంక ఏమి సాధించినట్లు?

ఏదైనా పుడితే అది చస్తుంది. కాని 'అసహనం' అనేది తొందరగా చావదు. ఒకదేశం యొక్క అసహనానికి ప్రతీక కరోనా. ఎప్పుడు చస్తుందో చూడాలి.



– ఆచార్య మసన చెన్నప్ప
సెల్:9885654381

## న్యాయం న్యాయమేనా



-డా. సి. భవానీదేవి
9866847000

ఒక ఆడతనంమీద దాడి జరిగిన ప్రతిసారీ
న్యాయంకోసం సమూహాలు ఆక్రోశిస్తుంటాయి
మనం ఏర్పాటుచేసుకున్న గొప్ప నాగరిక వ్యవస్థ
జరిపించే న్యాయం నిజమైన న్యాయంలా అనిపించదు
మన తృప్తి కోసం మనం రాసుకున్న మరణశాసనాలను
న్యాయమనుకుంటూ తలదించుకుంటాం
ఇవ్వాళ స్త్రీత్వమంటే
అనుభవించే ఒక ఉపకరణం
ఈ సమయంలో సత్యంకూడా శూన్యంలా కనిపిస్తుంది
రాతి గుర్రాలకూ రెక్కలొస్తాయి
సమసమాజ రాజ్యాంగ పుటలలోంచి
కుల, మత, వర్గ, ప్రాంత,ఆర్థికస్థాయిల ప్రాతిపదికన
న్యాయదేవత నిట్టూర్పుల్ని తీర్పులుగా విడుస్తుంటుంది
మంది మధ్యలో రోదిస్తున్నఆత్మీయుల ఏకాకితనం
చితిలోని బూడిదగా మారుతూ
నిప్పును కూడా ఉక్కిరి బిక్కిరి చేస్తుంది
కమురుకంపు నిండిన శ్మశానం గాలి
సమాజం చుట్టూ రెక్కల్లల్లార్చుతూ
వికృతహాస్యం చేస్తూ వెక్కిరిస్తుంది
ఆమె శరీరం ఆటవస్తువయినప్పుడు
పుట్టుకనుంచి చివరి శ్వాసదాకా
వ్యవస్థతో ఎన్నెన్ని క్రూరయుద్ధాలు చేయాలో !
తక్షణ చర్యలకోసం ఇంక తిరగరాసుకోవలసింది...
నేరగాళ్లను పోషిస్తూ నేరాన్ని నీరుగార్చే
అసహనీయ అతిమానవీయ అన్యాయచట్టాలనే !.

## హ్వాహ్వాహ్వా!

వంటింట్లో అమ్మ
అలికిడి వినిపించింది
హఠాత్తుగా ఆకలి నిద్ర లేచింది.
గేటు ముందు నాన్న 'సరాయింపు'
అదుపాజ్ఞల జారీతో
ఇంటి నిండా నిశ్శబ్దం ఆవరించింది.
చీకటి క్రమంగా మింగేస్తుంది వెలుతురును
పడమటి కనుమల్లో సూర్యుడు
జీవ సమాధిలోకి వెళ్తున్నాడని.
రంగప్రవేశం చేశాడు రేరాజు
తారాభామలతో తదిగినతోం అంటూ
రాత్రి క్రీడలకు తెర తీయడానికి.
శాలువా భుజాలపై కప్పినట్టుంది
అతిథిగా
సభావేదికపై ఉన్నట్టున్నాను.
డెక్కల చప్పుడు వినబడుతుంది
రాకుమారుడిలా
గుర్రంపై స్వారీ చేస్తున్నట్టున్నాను.
గాలిలో తేలిపోతూ
ఊహల కలల పల్లకీలో ఊరేగుతున్నాను.
ప్రాతః కాలం ప్రవేశించిందేమో
పక్షులు రెక్కలు విదిలిస్తున్నాయి
గూటిలోంచి ఎగిరి వెళ్ళడానికి.
మత్తు తెర తొలగించి
కళ్ళు తెరిచి చూడగానే
వర్తమానంలో కదలాడింది
గానుగెద్దులా నడవాల్సిన మరో రోజు.
హ్వాహ్వాహ్వా..!



–ఆచార్య కదారు వీరారెడ్డి
సెల్: 9392447007

# ఖాకీ వనంలో కోకిల పాట

## మూగవోయిన రాచపల్లి గొంతు



**ప్రశ్నించే తత్వం దేనికైనా స్పందించే హృదయం పోలీసులకుండదనుకుంటారు కొందరు**
**కఠినంగా కనిపించే ఖాకీలను కదిలిస్తే తెలుస్తుంది వారి హృదయ వేదన**
**వృత్తిరీత్యా విధి విధానాలకు లోబడి కొన్నింటిని త్యజించాల్సిన పరిస్థితి**
**కొన్ని పొందాలంటే కొన్ని వదులుకోవాలి సరిగ్గా దానికి ఉదాహరణే రాచపల్లి ప్రభు.**

తెలుగునాట మారుమ్రోగిన పాట పండితులనుంచి పామరులవరకు అలరించిన పాట, నాంపల్లి టేషనుకాడి రాజాలింగో ..... రాజాలింగా.... రామారాజ్యం తీరుచూడు శివశంభులింగా.... ఆ ఒక్కపాటతో అశేష కీర్తినార్జించిన కళాకారుడు రాచపల్లి ప్రభు. జూన్ 16న గుండెపోటు రావడంతో ఆకశ్మిక మృతిచెందారు. తన ప్రాణం పోయినా తను ప్రాణం పోసిన పాట మాత్రం అమరమై నిలిచింది.

ప్రజానాట్యమండలి కళాకారుల ద్వారా విస్తృత ప్రచారాన్ని పొందిన ఆ పాట ధవళ సత్యం, రెడ్ స్టార్ మాదాల రంగారావు లాంటి దిగ్గజాల దృష్టిలో పడి ఎర్రమల్లెలు సినిమాకు ఎంపికయింది. ఆ చిత్రంలో ఎస్.పి. శైలజ చేత పాడించారు ఈ పాటను. అలా తెరంగేట్రం చేసి జగద్విఖ్యాతి నార్జించుకుందాపాట.

తెలుగు చలన చిత్ర గీతాలలో 100 ఉత్తమ గీతాలను ఎంపిక చేయవలసి వస్తే ఆ జాబితాలో తప్పకుండా ఈ పాటకు చోటు దక్కుతుంది. వందేళ్ళ సినిమా చరిత్రలో వంద పాటల్లో ఒకటిగా గుర్తింపు పొందటం ఆషామాషీ కాదు. అది ఈ పాటకు దక్కిన ప్రత్యేకత. గీతరచయితగా ప్రభుకు ఇంతకన్నా ఏం కావాలి?

1975 ఖమ్మం పట్టణంలో ప్రజానాట్యమండలి 2 వారాలపాటు నిర్వహించిన రచయితలు, కళాకారులు, సినీ పెద్దలు పాల్గొన్న శిక్షణా శిబిరంలో మన రాచపల్లి ప్రభు ఉత్సాహంగా పాల్గొని సినీరంగ స్థల సాహిత్య దిగ్గజాలైన శ్రీ గజ్జెల మల్లారెడ్డి, శ్రీ రాంభట్ల కృష్ణమూర్తి, రక్తకన్నీరు శ్రీ నాగభూషణం, శ్రీ మిక్కిలినేని రాధాకృష్ణమూర్తి, శ్రీ కోగంటి గోపాలకృష్ణయ్య లాంటి వారిచే ప్రశంసలందుకున్నారు. ప్రజల భాషలో ప్రజల బాణీలో ఆలపించిన ప్రభు ప్రజాదరణతో పాటు, భారత కమ్యూనిస్టుపార్టీ అగ్ర నాయకులు శ్రీ చంద్ర రాజేశ్వరరావు, శ్రీ నీలం రాజశేఖరరెడ్డి, శ్రీ తమ్మారెడ్డి సత్యనారాయణ లాంటి రాజకీయ దిగ్గజాల ప్రశంసలు కూడా పొందారు.

హైదరాబాదు పాతనగరం శాలిబండలో శ్రీ రాచపల్లి బాలయ్య-శ్రీమతి శాంతాదేవి దంపతుల గారాలపట్టిగా జన్మించారు, బాల్యంలోనే తండ్రిని పోగొట్టుకోవడంతో తల్లి పెంపకంలోనే పెరిగారు, నివాసం పాతనగరమేకాని, ప్రభుతల్లి తిలక్‌రోడ్‌లో ఉన్న మనోరంజితం బాలికల పాఠశాలలో ఉపాధ్యాయురాలిగా పనిచేస్తూ కొడుకుని ప్రయోజకుడిని చేసింది. మెట్రిక్యులేషన్ పూర్తిచేసుకున్న ప్రభు సాంకేతిక విద్యపై మక్కువతో ఆ దిశగా అడుగులేసి పట్టా సాధించి పోలీస్ శాఖలో ఉద్యోగం సంపాదించారు. అమ్మ కష్టాలను దూరం చేసానన్న సంతృప్తి మిగిలించుకున్నా, తన వృత్తికి ప్రవృత్తికి నిరంతం ఘర్షణే. ఎమర్జెన్సీ రోజుల్లో తను పని చేస్తున్న సంస్థ ఉన్నతాధికారి పిలిచి "పోలీసు ఉద్యోగం చేస్తూ ప్రజా చైతన్య విప్లవ గీతాలు రాస్తూ పాడు తున్న విషయం మా దృష్టికి వచ్చింది. ఇది కోడ్ ఆఫ్ కాండాక్ట్ కు విరుద్ధం కాబట్టి, నౌకరీ కావాలో, నాటకాలు కావాలో నిర్ణయించుకోమని" హెచ్చరిస్తే... అమ్మ పడ్డ కష్టాలు కళ్ళారా చూసిన ప్రభు ఉదర పోషణ కోసం ఉద్యోగం అన్న ఒకే ఒక్క కారణంతో పాటను త్యజించాల్సి వచ్చింది.

సరిగ్గా ఆ సంధి సమయంలో నేను పోలీస్ శాఖలో చేరడం జరిగింది. అప్పటికే ప్రభుగురించి విన్న నేను ఉద్యోగంలో చేరిన కొన్ని నెలల తరువాత కలవటం జరిగింది. అప్పుడప్పుడే కథా రచయితగా అడుగులు వేస్తున్న నన్ను ఆప్యాయంగా చేరదీసి మార్గదర్శనం చేసారు, అలా మొదలయిన మా అనుబంధం వారు ఇన్‌స్పెక్టర్ ఆఫ్ పోలీస్‌గా ఉన్న సమయాన నేను సబ్ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ పోలీస్‌గా ఆయన అనుచరుడిగా పని చేసే మహద్భాగ్యం నాకు దక్కింది. ఆయన పదవీ విరమణ చేసినా, తుది శ్వాస విడిచే వరకు మా బంధం కొనసాగింది.

నా మిత్రుడు, సఖుడు, గురువు అయిన రాచపల్లి ప్రభు గారి ఆకస్మిక మరణం నన్ను తీవ్ర దుఃఖసాగరంలో ముంచివేసింది. ఈ లోటు ఎన్నటికి తీరనిది. శ్రద్ధాంజలి ఘటిస్తూ వారికి ఇవే నా ఘన నివాళి ...



– పెద్దూరి వెంకటదాసు
సెల్:9290910498

## వేయి తలల జ్ఞానం!

మనకు
కొంచెం తొందరెక్కువ
ఇవ్వాళ మొక్కను నాటి
రేపే రాయి విసురుతాం
తీయని ఫలాల కోసం!
చెట్టు కాల పరీక్షను కోరుకుంటది
ఆ మహా వృక్షానికి
వందేళ్ళు నిండనిదే
ఈ దేశానికి ఫలాలందలే!
నోరు పారేసుకోవడం
అన్ని సందర్భాలకు అచ్చిరాదు
మౌనం వెలుగులోనే
ఆయన కాలాన్ని జయించాడు
అవకాశాల కోసం
స్వార్థంతో ఎవరు పరుగెత్తినా
ఎండ మావులు వెక్కిరిస్తాయి
అతను ఇండియా గేట్ వద్ద
మూటా ముల్లే సర్దుకుంటుంటే
దేశం ఆశగా అతని వైపు చూసింది!
పద్నాలుగు భాషలొచ్చినా
అతనొక్క మాట చెప్పలే
సంస్కరణల వ్యవసాయం మొదలు
పెట్టిండు
వెను వెంటనే మొలకలొచ్చినవి!
ఇవ్వాళ
ఎవరి జేబులో చేయి పెట్టినా
కలమూ కాగితమూ
నాలుగు రూపాయలు
చేతికి తగులుతున్నాయంటే
వేయి తలల జ్ఞానంతో
ఆ వామనుడు వెదజల్లిన కాంతులే
దేశాన్ని వెలిగించి వెళ్ళినా
అతను చప్పట్లు కొట్టమని
ఏనాడూ మనల్ని అడుగలే!!



– కోట్ల వెంకటేశ్వర రెడ్డి
9440233261

## అమరుడు

చౌకబారు చర్య చైనా దురంతము
రోజురోజు పెరిగి రోతకలుగ
శత్రుసైనికులను సంహరించితివీవు
భరతవీర ! భరతమాత పుత్ర !!

సూర్యపేట వీర సుతుడ సంతోషుడా
వీరమరణమంది వేగుచుక్క
అమరుడైతివీవు అక్షరాంజలి నీకు
భరతవీర ! భరతమాత పుత్ర !!

తల్లి మంజులమ్మ తండ్రి ఉపేంద్రుడు
ధాత్రినిన్నుగాంచి ధన్యులైరి
అవని పితరులకును ఆదర్శమూర్తులు
భరతవీర ! భరతమాత పుత్ర !!

సాధుసుగుణశీల సాధ్వి సంతోషిణి
ధర్మపత్ని నీకు ధన్యచరిత
తల్లిదండ్రిభార్య తనయుల వీడిన
భరతవీర ! భరతమాత పుత్ర !!

దేశరక్షణమ్మె ధీరత్వమనిఎంచి
జన్మభూమి సేవ జేసినావు
ప్రాణమిచ్చినావు భారతభూమికై
భరతవీర ! భరతమాత పుత్ర !!

మరువలేము నిన్ను మాటతప్పగలేము? !
నీదు ఆశయమ్ము నిజము జేయ
అడుగుజాడ నీది ఆ మార్గమేమాది
భరతవీర ! భరతమాత పుత్ర !!



-బండిరాజుల శంకర్
9948050608

## మానవతామూర్తి

వైద్యం అమూల్యం
వెలకట్ట లేని అద్భుత శాస్త్రం
ఇది జగమెరిగిన సత్యం
అందుకే
వైద్యో నారాయణో హరి అన్నారు
మనిషి జననం ఓ సంచలనం
తన చూపు ఓ అద్భుతం
వినికిడి ఓనిగూఢ రహస్యం
మాట్లాడడం మాటలకే
అందని గమ్మత్తైన సూత్రం
ఊపిరి బహు నేర్పరి
శ్వాసే దాని ధ్యాస
గుప్పెడు గుండె చప్పుడు విప్పును
ఎన్నో భావాల గుట్టును
గుప్పెడు గుండె చప్పుడు విప్పును
మరెన్నో వ్యాధుల గుట్టును
వెన్నెముక ఓ గొప్ప ఎముక
అది సమస్త నాడుల చేరిక
భూమండలంలో
ఎవరూ విప్పలేని మెలిక
నాడీమండలం ఓ ఋషి కమండలం
ఓ విద్యుత్తు ప్రవాహం
వైద్య శాస్త్రంలో
అబ్బుర పరిచే ఈ ధర్మం
మత్తు శాస్త్రానికి ఆధారం
ఈ మత్తు శాస్త్రం ముందు
ఎంతట నొప్పైనా చిత్తు
మూత్ర పిండం
సమస్త జీవచర్యలకి ఓ గట్టి పిండం
చర్మం రక్షణ కవచం
సౌందర్య భూషణం
పిల్లల వైద్యం
పసి హృదయాలను
పట్టుకోగలిగే నేర్పరితనం
ఆయుర్వేదం
మన జీవితంలో అంతర్భాగం
ఇలా శాఖోపశాఖలుగా విస్తరించిన వైద్య శాస్త్రం
సమస్త మానవాళికి ప్రాణాధారం
సేవే ధర్మంగా
సామాజిక భాధ్యతని గుర్తెరిగి
సమాజ ఆరోగ్య సంరక్షణ కై
అహర్నిశలు శ్రమిస్తూ
కొవ్వొత్తిలా తాను కరుగుతూ కూడా
కోట్లాది మంది జీవితాలలో
వెలుగులు నింపుతూ
ఆరోగ్యాన్ని అక్షయ పాత్రగా అందిస్తూ
మానవ సేవ లో తరించిన
మానవతా మూర్తి వైద్యుడు



-డా.రానవేయిన రమేష్
9849294694

## విధ్వంసం

వాగు లోని ఇసుక కన్నీళ్లు
పల్లె పల్లె న కొంత బాట తడుపుతూ
బాటమ్మ తో బాసలు
పల్లె తల్లి తో ఊసులు
మోసుకు పోయే టిప్పర్ లలో
వాగు సౌందర్యం బందీ
పల్లెను దాటుతున్నా నా
గుట్టల గుండెల్లో
గుణపాలవుతున్న క్వారీలు
దర్జాగా గుండెల్ని
సమానం గా కత్తిరిస్తూ వెక్కిరిస్తూ
పేలుడును కంటిముందు చూస్తూ
మౌనం గా
గాలి వీస్తూ ప్రశ్నిస్తున్నది
భూమి చేసిన పాప మేమని
కాలం తూర్పారా పడుతున్నది
చివరకు మిగిలేదేమని
కబీజ్ఆ ల ఇజాలు పదెనెక్కి
జాగలను కోస్తున్నాయి
బూట్లచప్పుళ్ళు బట్టల పలకరింపులు
ముసలితాత ఆలోచనౌ తున్నాడు
గాలిని తాకుతూ
ఓ వైపు కాసుల బేరం
మరో వైపు ప్రకృతి హారం
వనరుల విధ్వంసం
చివరకు మిగిలేది
కనుల ముందు చూసేది
గాలిని కమ్మే రోజు
అన్నీ అమ్మే రోజు.



–సిరిసిల్లా గఫుర్ శిక్షక్
9849062038

## మాయలమారి

అయినా ఏం చెప్పమంటావ్ నీ గురించి
ఆకారం లేని అణువంత నలుసువి
అయినా దేహ దేశాలను
ధ్వంసం చేస్తున్న దంష్ట్రకి కదే నీవు
అమాయకులైన అవనిబిడ్డలను
అంతం చేయాలని అదను కోసం
పొంచివున్న హంతకివి కదే నీవు.

చూపులకు కూడా చిక్కకుండా
దేశ దేశాలను దాటి వచ్చి కనబడిన
వారినందరిని కబళిస్తున్నా.
కథనరంగంలో శిథిల రథ చక్రం కింద
కూరుకపోయిన కర్ణునిలా చావు బతుకుల మధ్య
సతమతమయ్యేటట్లు చేశావు.

ఆకు అలము పెన్ను గన్ను ఏదేతే నేమి
కనబడిన వాటినెల్లా కరుచుకొని వచ్చి
ఊపిరి సంచుల్లోకి చొరబడి
దేహాంతరంగాల్ని ధ్వంసం చేసి
మరణమృదంగం మోగిస్తుంటే
కీళ్లు సడలిన మా ఇల్లు తల్లి అంతులేని
దుఃఖాన్ని ఒలకబోసుకుంటున్నది.

దీని దుంప తెగా ?
ఎపుడు ఏ వాహకం ఎక్కి వస్తుందో
ఎపుడు ఎవరి ప్రాణాలను హరిస్తుందో
నన్న భయం గుండెల్ని ముక్కలు చేస్తుంటే
చీకటి గుహలో చతికిల బడిన
గబ్బిలంలా చావు డప్పుల మోత వింటూ
క్షణ క్షణం ఉలికిపడుతున్నాము.

అయినా ఓ మాయలమారి కరోనా
నువ్వు ఎన్నెన్ని ఎత్తులు వేసి
మమ్ములను మట్టు పెట్టాలని చూసినా
పట్టువదలని విక్రమార్కులమై
నీ పుట్టుకనే కాదు
నీ చావు మర్మాన్ని తెలుసుకుంటాం.

అయినా నీలాంటి నీచ కీచక వైరసులెన్ని
మా శాస్త్ర సాంకేతిక మేధో క్రతువులో
పడి సమిధలై బూడిద కాలేదు ?

అందుకే ఇప్పుడొక సడలని సంకల్పంతో
బతికినంత కాలం కలిసుండేందుకు
తాత్కాలికంగా భౌతికదూరం పాటిస్తూ
కలల గూడులో అందరం ఒక్కటై
హృదయాలను కలబోసుకుంటాం

ప్రాణాలను పణంగా పెట్టి
మా ప్రాణాలను కాపాడుతున్న తెల్ల కోటు
వేల్పులకు మానడకను నడతను
నిరంతరం సంస్కరిస్తున్న కాకి రక్షకులకు
పారిశుధ్య పరోపకారులకు నిత్యం
పాదాభివందనంచేస్తూ బతుకు భరోసా
వరాన్ని పొందుతాం

ఈరోజు కాకపోతే రేపైనా
మా మేధో పొది నుంచి
తీసే తిరుగు లేని సూదిమందు
శస్త్రాలతో నిన్ను ఛిద్రం చేస్తాం



**-ఆవుల వెంకటేసులు**
9505956886

## 'కరోనా' నానోలు

కోవిడ్
మిత్రుడు
శుభ్రత
మిత్రుడు

నాశికం
ముసుగు
కరము
తొడుగు

రోడ్డు
చెరశాల
గృహం
పర్ణశాల

కరోనా
గాయం
నిర్బంధం
గేయం

గుంపు
ముంపు
దూరం
నివారణ

వైద్యుడు
దేవుడు
పోలీస్
కవచం



-కయ్యూరు బాలసుబ్రమణ్యం
7780277240

## కళ్ళు తెరిచాము కరోనా

ప్రకృతిని బాధిస్తే నాశనం తప్పదని మనిషికి
బుద్ధిచెప్పి, కనువిప్పు కలిగించ వస్తివా కరోనా
నిత్యం రణగణ ధ్వనులతోరోడ్లపై కిటకిటలాడే జనం
బుద్ధిగా ఉంటే చూడ ఆశపడి వస్తివా కరోనా
ఏమైనవీ జనజీవన వ్యవహారాలు, నగరంలో వ్యాపారాలు, ఏమైనవీ విద్యార్థుల చదువులు
ఉద్యోగుల ఆర్భాటాలు, నిరుద్యోగుల పోరాటాలు
శక్తికిమించిన పనులతో సతమతమగుచున్న జీవుడు
ప్రాణాలు దక్కితే చాలనుకునే స్థితిని కలిగిస్తివా కరోనా
ధనము సుఖము కీర్తి కై పడరాని పాట్లు పడుతున్న
తన బిడ్డల ఆవేదన చూసి, కన్నీరుపెడుతున్న
భూమాతను బుజ్జగించి ధైర్యం చెప్ప వస్తివా కరోనా
పుడమి తల్లి ప్రసాదించిన ప్రకృతి సంపదను
సహజంగా స్వీకరిస్తే మనిషి గొప్పతనం ఏముందని
కలిషితం చేస్తున్న మానవుని అహంకారం చూసి
చిన్నబుచ్చుకున్న ప్రకృతిని ఓదార్చ వస్తివా కరోనా
చెరువులు మాయంచేసి నీటికొరత సృష్టించి
వ్యవసాయ భూములను కనుమరుగు చేసి
అన్నదాతల ఆకలి చావులకు కారణమైన
నాగరికుల మూర్ఖత్వాన్ని మందలించ వస్తివాకరోనా
మూగ జీవాలను చంపుకుతినే మనిషి పై పగబట్టి
కంటికి కనిపించని క్రిమివై, జనజీవన ప్రవంతిని అల్లకల్లోలం చేసి, అంతానాదే అని విర్రవీగిన
ఆదునికుల గర్వాన్ని అణచివేయ వస్తివా కరోనా
యావత్ ప్రపంచాన్ని కలవరపరచి వణికిస్తూ
మానవజాతిని స్వీయనిర్బంధం పాలుచేసి
కాసులతో ఏదైనా కొనవచ్చనే అహంభావంతో
బుద్ధిమందగించిన మానవుని సరిచేయవస్తివా కరోనా
చాలుచాలు కరోనా మాపై కరుణజూపు ఇకనైనా
కళ్లు తెరిచి బతుకు విలువ తెలుసుకున్నాము కరోనా
సకలప్రాణులపట్ల దయతో మసులుకుంటాము కరోనా
ఇంక చాలు వెళ్లిపో కరోనా వెళ్లి మరల రాకు కరోనా.



**-గంజి కళావతి**
8639695507

## యుద్ధభేరి

ఈ జన సమూహాల మధ్య సంచరించి
మానవ సమూహాన్ని హననం చేయుటకై
పూనుకున్న ఓ కరోనా!
నీ మృత్యుఘోషాతరంగాలు
లోకమంతా వినిపిస్తూనే ఉన్నాయి
నీ ఈ విషాదం
ప్రపంచ వేదికపై తుఫానుగా మారి
మనుషులను ఊడ్చి వేస్తూనే ఉన్నది
అయినా,నీ రక్తదాహం తీరినట్లులేదు
సమస్త ప్రపంచాన్ని
భయం గుప్పిట్లో దాచావు
ప్రతి మనిషి అభద్రతా భావాలమధ్య ఉన్నాడు
నిరు పేదలు ఆకలి పేగులతో అలమటిస్తున్నారు
ఇప్పుడు నిన్ను అంతం చేయడానికి
ప్రపంచమంతా ఒకటయింది
రంగుల జెండాలన్నీ ఏకమైనాయి
నిన్ను అంతంచేయడానికి
ఆయుధాలు సిద్ధం చేస్తోంది

నీపై యుద్ధభేరి మోగిస్తుంది
నీ మరణ రహస్యాలను శోధించే
ప్రయత్నంలో మా శాస్త్రవేత్తలున్నారు
మా వైద్యులు విరామం లేక పరిశ్రమిస్తున్నారు
నీ క్షుద్ర ప్రళయ తాండవాన్ని నిరోధించడానికి
మా పారిశుద్ధ్య కార్మికులు
నిద్రాహారాలు మాని పని చేస్తున్నారు
నీ గొలుసుకట్టును నిలువరించడానికి
మేం లాక్ డౌన్ మంత్రంతో
మమ్మల్ని కట్టుదిట్టం చేసుకున్నాం
తొందరలోనే నీకు గోరీ కడుతాం
ఈ యుద్ధంలో మేం విజయం సాధిస్తాం
అమావాస్య చీకట్లను పారదోలుతాం
మళ్ళీ మా పున్నమి వెన్నెలను
తిరిగి తెచ్చుకుంటాం



**-మల్లెఖేడి రామోజీ**
6304728329

## కరోనా కష్టాలు!

నిలువ నీడ లేకుండా
చేసిన కరోనా అతన్ని దిక్కులేకుండా
జేసి కట్టుబట్టలతో
నడిరోడ్డు మీద నిలబెట్టింది.

ఉండేందుకు గూడులేక నెత్తిన ముల్లే మూటతో
నిలబడిన అతని దుస్థితిని చూసి
గేలిచేస్తున్నట్టు పగలబడి నవ్వుతుంది

సంకలోని పిల్ల ఉక్కపట్టి ఆకలితో ఏడుస్తుంటే
సముదాయించలేక సతమతమవుతున్న
అతని దీనస్థితిని చూసి సమస్యల
జడివానగమారి కష్టాలనబడే
సుడిగుండంలోకి తోసేసింది

తిండి లేకుండా ఒకవైపు అతను
ఆకలితో అలమటిస్తుంటే
అన్నంపొట్లంలోకి దూరి
ముట్టుకోవద్దంటు శాసిస్తుంది.

బతికేందుకు దారిలేక
సొంతూరికి పోదాం అనుకుంటే
సుదూరమైన అతని గమ్యానికి
చేరనీయకుండా అడ్డుతగిలి
మృత్యురూపంలో కబళిస్తుంది

కరుణ జూపని కరోనాతో
బేజారెత్తిన అతని జీవితం
బతకలేక చావలేక జీవచ్ఛవంగా మారి
అందరిని ఆలోచింప జేస్తుంది!!



**-జవేరియా**
9849931255

# గుండె లోతుల్ని ఆర్ద్రతతో తడిపే 'అమ్మ నానీలు'



ఏక వస్తువు తీసుకుని కవితాసంపుటిని ప్రకటించడమనేది కష్టంతో కూడుకున్న పని. అలా ఏక వస్తువు మీద వచ్చిన నానీల సంపుటాలూ ఉన్నాయి. ఇప్పుడు 'అమ్మ నానీలు' పేరిట వెన్నెల సత్యం నానీల సంపుటి తీసుకొచ్చాడు. అమ్మమీద కవిత్వం చెప్పని కవి దాదాపుగా ఉండరేమో. అదే కోవలో మన సత్యం కూడా చెప్పి ఉండవచ్చని మనం అనుకోవచ్చు. ఐతే సత్యం రాసిన ఈ అమ్మనానీల్లో ఆర్ద్రత ఉంది, అనురాగం ఉంది. అంతులేని ఆవేదనా ఉంది. ఇలా చెప్పుకుంటూ పోతే మనసుని కదిలించే అంశాలెన్నో ఉన్నాయి. వీటన్నిటినీ మించి అతని నిబద్ధత, నిజాయితీ కనిపించింది ఈ అమ్మనానీల్లో.

ఈ సంపుటిలో కేవలం తల్లి మీద ప్రేమను కురిపించే నానీలే రాయలేదు సత్యం. వృద్ధాప్యంలో ఉన్న అమ్మను ఆదరించని సంతానం గురించే ఎక్కువగా రాశాడు. అదీనూ ఆవేదన నిండిన గుండెతో. ఈ సంపుటి చదవగానే మన మనసు అతని గుండెలానే భారమవుతుంది. ఆలోచనని రేకెత్తిస్తుంది.

సాధారణంగా అమ్మ గొప్పతనాన్ని చెప్పాలనుకున్నప్పుడు ఎక్కువగా అందరు అమ్మ ప్రేమను, అమ్మ లాలనను చెపుతూ మొదలుపెడతారు. ఇక్కడ సత్యం మాత్రం అమ్మ పడ్డ కష్టాన్నే నెమరువేసుకున్నాడు. ఆ కష్టమే అతని ఉన్నతికి కారణమని మనసునిండా తలుచుకున్నాడు.

**"పొగాకు ఘాటు**
**పేగుల్ని తెంపేది**
**ఐనా కన్నపేగుల్ని**
**కాపాడుకుంది అమ్మ**
**కేవలం చదవడం వస్తే చాలు"...**

వ్యాఖ్యానం అవసరం లేని గుండెల్ని తాకే నానీ ఇది.



ఒకే వస్తువును తీసుకొని వందకుపైగా నానీలు రాయడమనేది ఎంతో కష్టమైన పని అనేది మనం ఊహించొచ్చు. ఇక్కడ సత్యం అమ్మ మీద రాస్తూ ఎక్కడా పునరుక్తి అన్న భావనని రానీయకుండా రాయడం అతని సృజనాత్మక శక్తిని తెలియజేస్తుంది. అమ్మను రైతుతో, చెట్టుతో, అరణ్యంతో, పంచభూతాలతో, సమస్త ప్రకృతితో పోలుస్తూ అనేక ప్రతీకలతో నానీలు రాశాడు. ఈ ప్రయత్నమంతా లోకమంతా అమ్మతనమే అని గుర్తుచేయడానికి. అంతటితో ఆగకుండా మనిషి ప్రకృతిని, అమ్మను ఎలా మరిచిపోతున్నాడో గుర్తుచేయడానికి మానవీయ స్పృహని, పర్యావరణ స్పృహని ఏకకాలంలో చిన్న నానీలో రాసిన తీరుకి సత్యాన్ని సత్యంగా మెచ్చుకోవాలి.

**"అమ్మలాంటిదే**
**అరణ్యం కూడా**
**అన్ని జీవుల్ని**
**అక్కున చేర్చుకుంటుంది"**

సమాజంలో జరుగుతున్న సమకాలీన సంఘటనలకు స్పందించి విమర్శనాత్మకదృష్టితో కవిత్వం రాస్తుంటాడు సత్యం. ఈ అమ్మ నానీల్లో సైతం ఆ ముద్రని చూపగలిగాడు.

**"బేడీలు**
**రైతులకు కాదు**
**అమ్మల్ని పట్టించుకోని**
**కొడుకులకు వేయాలి"**

ఇక్కడ సత్యం భావనాశక్తిని మెచ్చుకోవాలి. నానీల నిర్మాణ విశిష్టతని మెచ్చుకోవాలి.

అనంతమైన అమ్మప్రేమను చెప్పడానికి ఒకదగ్గర ఇలా అంటాడు సత్యం.

**"తల్లిప్రేమ ముందు**
**సప్తసముద్రాలెంత**
**సాగిలపడి**
**ప్రణమిల్లాల్సిందే"**

అమ్మ ప్రకృతిధర్మాన్ని సైతం ఎదురిస్తుంది పిల్లల కోసం. అలాంటి అమ్మ ఆఖరి రోజుల్లో కన్నీటిపాలవుతుంది. ఈ రెంటిని ఒకే నానీలో చెప్పి మనని కన్నీటిపర్యంతం చేస్తాడు సత్యం.

**"నీళ్ళు పల్లానికే**
**ప్రవహిస్తాయి**
**ఆమె కన్నీళ్ళు మాత్రం**
**ఎదురెక్కుతాయి"**

అంతా ఆర్ద్రత, ఆవేదన, అనురాగాలే కనిపిస్తే భావుకత ఎక్కడా అనే ఆలోచన రావొచ్చు. దాన్నీ వదల్లేదు సత్యం. ఐతే భావుకతని, పేదరికాన్ని ఏకకాలంలో సంధించి చూపాడు.

**"అమ్మకొంగును**
**ఆకాశంలా కప్పుకున్నా**
**చిరుగులన్నీ**
**నక్షత్రాలైనాయి**

**అమ్మ పాతచీరతో**
**కుట్టిన బొంత**
**బాల్యజ్ఞాపకాలు**
**నిండిన పాలపుంత"**

సత్యం కవిత్వంలో తాత్వికత కూడా ఒక అంశమే. అలా తాత్వికతను పలికించిన ఈ నానీ చూడండి.

**"ఓదార్పునిచ్చే శక్తి**
**లోకంలో ఇద్దరికే**
**కన్నతల్లికీ**
**కన్నీటిచుక్కకీ"**

పాఠకుడిలో నిగూఢ ఆలోచనని రేకెత్తించే లా చేయగలిగేవాడు మంచి కవి అనిపించుకుంటాడు. అలాంటి నానీని చూడండి

**"అమ్మ గర్భం కన్నా**
**భద్రమైనదేది?**
**ఇప్పటికీ**
**వెతుకుతూనే ఉన్నా**

**ఇక ఆఖరుగా**
**అన్నమొకటేనా**
**అక్షరం కూడా**
**అమ్మపెట్టిన భిక్షే**
**విద్య కూడా**

ఆ అక్షరాలతోనే అమ్మకు అక్షరార్చన చేశాడు సత్యం.

వందలకొద్ది వచ్చిన నానీల సంపుటాల్లో ఓ మేలిమి సంపుటంగా ఈ 'అమ్మ నానీలు' నిలిచిపోతుందని నానీల నాన్న డా. ఎన్. గోపి గారి నుండి కితాబునందుకున్న సత్యం మరిన్ని బాధ్యతాయుతమైన రచనలు చేయాలని ఆశిద్దాం.



**-రాపోలు సీతారామరాజు**
+27 727747549

## వలస కార్మికుల వెతలు

చెమట చుక్కల్ని లెక్కేసుకుని
మెతుకుల్ని విదిల్చే నగరానికి కరోనా తాళం వేశాకనే
రహదారుల తెరలపై
మన దేశ వికాస ధారావాహికలు ప్రదర్శిత మవుతున్నాయి
కాళ్ళే ఒత్తులై ఎర్రటి చమురుతో
వెలిగిపోతున్న దారుల దీపాల కాంతిలో
దేశం వెలిగిపోతున్న దృశ్యాలు దర్శనమిస్తున్నాయి
వలస బాటలోని చెమట పాటకు
ఎడారి గొంతులన్నీ సాహిత్యాన్ని కూర్చుకుంటున్నాయి
లోయల్ని ఒంపుకున్న పాదాలన్నీ తాళం వేస్తున్నాయి
కాంక్రీట్ వనాల్లో సిమెంట్ గంధంతో మెరిసిన చంకలన్నీ
రేపటి శ్రమ సౌందర్యాలకు సింహాసనాలయ్యాయి
పక్కకొరిగిన ధ్వజస్తంభాల్లాగ వంగిన అమ్మల నడుములన్నీ
భరతనాట్య భంగిమల్ని సాధన చేస్తున్నట్లున్నాయి
చంటి బిడ్డల నోళ్ళన్నీ
అమ్మ స్తన్యాల ఉనికిని వెతుక్కుంటున్నాయి
జీవిత గాయాలెన్నున్నా అభివృద్ధి గీతంలో సమిధలైనోళ్ళు
బతుకు చీకట్లనే ప్రమిదలుగా చేసి
దేశ సౌభాగ్య గుమ్మానికి వెలుతురు తోరణాలు కట్టెటోళ్ళు
ఆకలిదప్పులకు నేడు నేలకొరుగుతున్నారు
పని శకలాల కింద నలిగిన వలసపక్షులు
తాము చేసిన నేరమేంటని ప్రశ్నిస్తున్నాయి
రైలు పట్టాలపై చావు పట్టా పుచ్చుకున్న ఆత్మలు
తాము చేసిన పాపమేంటని నిలదీస్తున్నాయి
ఇప్పుడైనా శాశ్వత పరిష్కారం చూపండని?

**-పుట్టపర్తి మల్లికార్జున**
9490439029

## స్వాగతం

మామిడి కొమ్మలపై మధురంగా
కోయిలలు కూసే కాలంలో గభాల్న వచ్చిన
అనుకోని అపాయకర అతిథి నువ్వు
నీ నామధేయం పలికితేనే
వింటినుండి విసిరివేయబడ్డ
బాణమై పోతున్నావ్..
విశ్వంభరలో నీ విశ్వరూపం
విశృంఖలత్వం చూసి
శాస్త్రవేత్తలే నివ్వెరపోతున్నారు
లోహ విహంగాలు, రైళ్ళు, వాహనాలు
నేల చూపులు చూస్తున్నాయ్
అగ్రరాజ్యాలు చూస్తున్నాయ్
అగ్రరాజ్యాలు ఆర్థికంగా
కుదేలవుతున్నాయ్–
అటునుండో ఇటునుండో
వైరస్ వ్యాపించిందంటూ
ఆరాలు తీయడం ఆరంభించాయ్

కంటికి కనిపించని అదృశ్య జీవివై నువ్వు
ఆర్థిక స్థితుల్నే తారుమారు చేస్తున్నావ్
కోట్ల మంది కొలువులు
కొల్లగొట్టుకు పోతున్నాయ్
అగమ్య గోచరంలో మేము
అనివార్య ప్రతాపమై నువ్వు
ప్రపంచదేశాల దేహాలకు
అపాయంగా మారిన నీకు
ఓ ఉపాయమై 'వ్యాక్సిన్' ఆవిర్భవిస్తుందిలే
ఆ ఉదయానికి
అపూర్వ స్వాగతమిస్తాం మేం.



**- డా॥ చిట్యాల రవీందర్**
సెల్: 7798891795

## కరోనా మృత్యు కేళీ...!

**(మణిపూసలు)**

చూడు చూడు వలసబ్రతుకు
తినడానికి లేదు మెతుకు
నిదురవోయె సూటుకేసు..
పైన పాప ఇల్లు కొరకు... !

చిన్ని కొడుకు నెత్తి మీద
బ్రతుకు బరువు పొట్ట మీద
సాగుచుండె వలస కూలి..
ఇల్లు చేరు ముదము మీద.. !

వయసులోనచిన్న వాడు
నడక తప్పనిల బుడతడు
కాళ్ళ చెప్పు లొకటి లేవు
కనికరించున సూరీడు....!

నెత్తిమీద బ్రతుకు బరువు
వలసనుంచి ఇంటి దెరువు
ఎండలిలను మండుచుండె
దరి జేర్చే వాడు కరువు... !

ఎండలేదు ఎసిమి లేదు
రోడ్డు రాళ్ళు నేల కదు
అలసి సొలసి నిద్ర కిలను
పట్టు పాన్పు లాయె నదును..!

కంకర పైన నిద్ర చూడు
వంకర వలస బ్రతుకు బీడు
పట్టించుకునె నాథుడేడి ?
ఎవరికి పట్టదీ గోడు... !

ఇంటి కెళ్ళ బస్సు లేక
లారి నెక్కు తీరు రాక
హృదయ వేదనలో ఉబుకు
గుండెరాయి చేసు కొనిక.. !

ఫోను లోన గుండె బాధ
కన్నీళ్ల సాగును వ్యథ...
చుట్టు ముట్టు యెవరులేరు
కరోనా దెచ్చె నిల కథ...!

భుజాలపై కొడుకు మోత
చేరాలికను ఇంటిచెంత
దారి వడువుట లేదెల?
తల్లిదండ్రులపై చింత... !

ఎవరువీరు?ఎవరువీరు?
ఎండ వేడి బ్రతుకు పోరు
వరుస బెట్టి వలస నుండి
వచ్చు ప్రాణ బరువు తీరు.. !
కొడుకు దప్పి దీర్చు తల్లి
ఇదంత కరోనా లొల్లి...
బ్రతుకు పైన ఆశ తోడ
మోస్తున్నదీ కల్పవల్లి... !

జీవితాన్ని మోయు బరువు
రహదారియు గుండెచెరువు..
పిల్లా పాపలతో తండ్రి...
నీడ నిచ్చు లేదు తరువు..!

తల్లిని మోస్తున్నట్టి కొడుకు
కింద మీద ఎండ ఉడుకు
తల్లి ఋణం తీర్చ గలడ!
ఇంటి దాకా తెచ్చుటకు... !!

క్రింద ఎండ పైన మండ
పిల్లాడికిని జ్వరమండ
నిస్సాయతయె తల్లితపన
బాబుకి నూరేళ్ళు నిండ..!
×
లారి పైన వలస బ్రతుకు
తినడానికి లేదు మెతుకు
గమ్యం చేరేవరకు వీరు
వుంటారా తుట్టతుదకు..!
×
అవ్వ కాళ్ళవీ పగుళ్ళు
నొప్పించె నరకపు తొళ్ళు
కరోనా భయపు నడకల
చావు రాని బాధ పుళ్ళు...!!!



**-డాక్టర్ గన్నోజు శ్రీనివాసాచారి**
8555899493

## ఎప్పుడైనా అనుకున్నామా...

ఎప్పుడైనా అనుకున్నామా
ప్రాణం గాలిలో
దీపం అవుతుందనీ...
అడ్డు పెట్టిన అరచేతులే
దీపాన్ని ఆర్పివేస్తాయనీ...

ఆత్మీయ కరచాలనాలే
ఆయుష్షుకు చివరి సంతకం చేస్తాయని!
భుజం తట్టి హత్తుకున్న
భరోసా ఆలింగనమే
భూమి మీద నూకలకు దూరం చేస్తుందని!

కలిసి వుంటే కలదు సుఖం కాదిప్పుడు
కావాల్సినంత దూరమే ప్రాణానికి రక్షణని
తిరగ రాయాల్సి వస్తున్న సూక్తులు!

ఇప్పుడు మృత్యువు
పందిరి మీది గుండులా
ఎప్పుడు ఊపిరి మీద పడుతుందో.

ఉచ్ఛ్వాస నిశ్వాసాలలో
విషవాయువై చొరబడి
ఉన్న ఫలానా అనంతంలో కలిపేస్తుందో..

రేపటిని కలగనే కనులను
ఉదయాలను చూడనీయకుండా
ఉసురు పోసుకుంటుందో...

ఈ ప్రాణ సంకటం నీదో నాదో కాదు
ప్రపంచమంతా
వణికి పోతున్న మానవ జాతిది!
ఇప్పుడు అందరి ప్రాణాలు
సుడిగాల్లో చిక్కుకున్న దీపాలే.



**-పురిమళ్ల సునంద**
9441815722

## ఈ నగరానికి ఏమైంది

జన జాతర జరుగుతున్నట్టున్న ఊరు
జడిలేని జీవనాన్ని గడుపుతున్నది.
నిత్యం వాహనాల చప్పుడు
డప్పుల మోతలను మించుతుంటే
నేడు వాయువు సడిని కూడా
వీణలకు వినపడుతున్న ఈ మా
నగరానికి ఏమైంది.......
ఎవ్వరి రాక లేదు..మా పోక అసలే లేదు
కానీ ఎవరింటిలో కూడా
కోలాహలం తగ్గలేదు .
పిజ్జా,బర్గర్లు ఆడర్లు లేవు,
బ్యూటీ మిల్లర్ల పొడ కాన రాలేదు
కనీసం సెలూన్ల సైడు చూడ లేదు.
ఆటోల వెనుక కొటేషన్లు కనపడలేదు
సినిమా హాళ్ళ సినిమా అసలే లేదు.

హోటళ్ల హోల్డింగుల హ్వాయలు లేవు.
నగల దగదగల షోయింగులు లేవు.
పానీ పురీ పానీయము గొంతులోకి పోలేదు.
గోబీ గోలీల గుర్తులు కనిపించ లేదు
మానవతను చాటే మనుషులకు
కొదవ లేనే లేదు..
మంచి పెంచు సమాజపు శ్వాస ఆగలేదు.
ఇవ్వన్నీ చూస్తున్నప్పుడు అనిపించింది
ఈ నగరానికి ఏమైంది....అని



**-సింగంపల్లి శేష సాయి కుమార్**
8639635907



## సంధికాలం

శాపమో ! వరమో !!
పెను మార్పులతో కాలం

గతితప్పి మతి చలించినట్టు
తన చుట్టూ తాను తిరిగే దిశను
కుడినుండి ఎడమకు మార్చినట్టుగా

నిత్యకృత్యాలను
ప్రకృతి ధర్మాలను ఏమార్చి
లోకాన్ని విడ్డూరంగా మార్చి

మంచి చెడులను తూకంవేసి
కాస్త మంచిని కొసరి
మరికాస్త చెడును చెత్తబుట్టలో విసరేసి

ప్రేమానురాగాలను
నిండు కుండలు చేసి
అభాగ్యులకు అక్షయపాత్రనిచ్చి
లేమికి కలిమినిచ్చి
కలిమికి కలతలు కల్పించి
మళ్ళీ కల్లలు లేమికిచ్చి
చిత్ర విచిత్రాలు చేసి

కర్షక కూలీల కడుపులు కొట్టి
వలస జీవులను నడిరోడ్డుపై వదిలేసి

కాలుష్యం కరిగించి
తేట జలాలు పారించి
ప్రకృతిని పచ్చగా నవ్వించి
మోదానికో ! ఖేదానికో !!
సృష్టినే ప్రతిసృష్టి చేసి

విశూచి పిశాచాన్ని గాలికి వదిలేసి
ప్రపంచం గుండెల్లో
కల్లోల కడలిని సృష్టించి

ఇది హర్షమో ! కన్నీటి వర్షమో !!
అంతుపట్టని సంధికాలంలో
తలరాతలు తారుమారు చేసి
సందిగ్ధంలో పడేసింది.



**- నాగముని. యం**
9490856185

## నీకు నీవే రక్షణ

ఇన్నాళ్లు
గూడు లోపల దాగి
ఉక్కబట్టిన శరీరంతో
దిక్కులు మరిచి కూర్చున్నావ్
ఇప్పుడు కాస్త
స్వేచ్ఛను తగిలించుకున్నాక
తగిన జాగ్రతల చిట్టా
జేబులో పెట్టక తప్పదు
నీ చుట్టూ
నియమాల గోడను నిర్మించుకొని
నీ బతుకు రాతకై
వాక్యాలు కూర్చుకోక తప్పదు
దారులన్నీ
మళ్ళీ పాద ధూళితో నిండిపోయాయి
గాలిని కూడా
వడబోసుకుని పీల్చక తప్పదు
నీ రక్షణ
నీ జీవన సంరక్షణ అంతా నీదే
మూసిన తలుపుల్ని తీసావు
లోకపు ప్రాంగణంలో
మళ్ళీ ఆట మొదలెట్టినావు
గెలుపైన ఓటమైనా
రెండు నీ చేతుల్లోనే తేలిపోవాలి
మళ్లీ ఉదయించే
సూర్యున్ని చూడాలంటే
అజాగ్రత్తతో నీవు అస్తమించకూడదు
తేడాలెరుగని కరోనా ముట్టడి
వేటా మార్గం ఇంకా సడలిపోలేదు
మనమే కట్టడి సంకెళ్ళు తెంచుకొని
జన జీవన ప్రవంతిలోకి అడుగేసావు
నీకు నీవే రక్షణ



**-నరెద్దుల రాజారెడ్డి**
ఫోన్ : 9866500305

## కరోనా భ్రమ చైనా

మా ముంగిట ధన్వంతరి అవతారంలా
ఈ నేల ఎగరేసిన పతాకంలా
తల ఎత్తి నిలుచున్నది వేప చెట్టు
అది విసిరే గాలి నీ వి(వే)షాలకు విరుగుడు

అదిగో మా వాకిట తులసి కోట
ఆరోగ్యానికి పెట్టని కోట

పసుపు కుంకుమలతో మా గుమ్మం
ఒలిచేస్తుంది రోగకారక జీవుల చర్మం

మా సింహ ద్వారానికి వేలాడు
మామిడి తోరణాలు
ఆ పచ్చదనమే పట్టించు నీకు ముచ్చెమటలు

ఉల్లి ఉసిరి అల్లం బెల్లం వెల్లుల్లి
ధనియాలు మిరియాలు మెంతులు ఆవాలు
లవంగాలు జీలకర్ర ఇంగువ సోపు వాము
మా వంటిల్లొక ఆయుర్వేద ఔషధశాల

పాద హస్త ప్రక్షాళనం మా విజ్ఞత
నమస్కారం మా సంస్కార ప్రజ్ఞత

ఈ గాలి నినదించు (ఆయుర్)వేద మంత్రాలు
ఈ నీ రు అందించు
సర్వరోగ నివారణ సకలౌషధాలు
ఈ మట్టి ఎగజిమ్ము దుర్జాతి
సూక్ష్మ కణ వినాశక దివ్య రస ద్రవ్యాలు

ఓ కరోనా!
నీ రోగం కుదిర్చే మందు లేదని నీలుగ బోకు



**-చిరమన వెంకట రమణయ్య**
94413 80336

# మోక్షగుండం బాటలో నడచిన శేషాచారి



'ఆస్తుల సంపాదనకన్నా ఆప్తులను సంపాదించు కోవడం మిన్న' అని నమ్మిన సిద్ధాంత వాది శేషాచారి.

**‘నీటికోసం, వనరుల కోసం కష్టపడకూడదని నీటి నిలువలను పెంపొందించాలని భావించారు. 60 సం॥ల క్రితమే ఇంకుడుగుంతల ఆలోచనను చేపట్టారు’.**

1958వ సంవత్సరం... నేటి ఉత్తరాఖండ్‌లోని హరిద్వార్... ఆగ్నేయ ఆసియా దేశాలకు మకుటాయమానమైన ‘రూర్కీ’ విశ్వ విద్యాలయం (ప్రస్తుతం ఐఐటి విద్యాసంస్థ)లో విద్యాభ్యాసం పూర్తి చేసుకొని, సగర్వంగా పట్టాపొంది, ఆనందోత్సాహాలతో స్వంత గ్రామా లకు చేరుకున్నారు విద్యార్థులంతా. అందులో ఓ చురుకైన విద్యార్థి... మోక్షగుండం వారే రోల్ మోడల్, నిరంతర సాంకేతికాభివృద్ధిపైనే ధ్యాస, తాను స్వస్థలం చేరుకు న్నారు. ఆ రాష్ట్ర, ఆ ప్రాంతాభివృద్ధి కోసం, కుటుంబం కోసం బృహత్తర కార్యక్రమం చేపట్టాల నుకున్నారు. తాను పనిచేసే నీటి పారుదల శాఖలో రాణించాలని ప్రయత్నం చేస్తున్న తరుణంలో, అనూహ్యంగా తాను చదువుకున్న సంస్థ నుంచి అధ్యాపకుడిగా నియామకపు ఉత్తర్వులు అందాయి. విద్యార్థులంతా నీ ప్రతిభకు తార్కాణమన్నారు. ఈ అరుదైన అవకాశాన్ని అంది పుచ్చుకోమని అన్నారు తోబు ట్టువులు. కానీ, “నేను విద్యార్థిగా వెళ్లిన ఆ సంస్థ నాకు ఎంతో విజా ్ఞనాన్ని అందించింది. ఆ స్ఫూర్తితోనే నేను ఓ నిర్ణయం తీసుకుంటున్నాను” అని పేర్కొన్న ఆ ఇంజి నీరే... **శ్రీ ఉత్తలూరి శేషాచారి** గారు. సొంత ప్రాంతా నికి, ఓ వ్యక్తిగా ఉన్నతంగా నిలిపిన విశ్వ విద్యాలయానికి కృతజ్ఞతలు తెలియజేస్తూనే, సున్నితంగా వారు ఇచ్చిన అవకాశాన్ని స్వీకరించలేనని చెప్పిన మహోన్నత వ్యక్తి **ఉత్తలూరి** వారు.

వీరు 1923లో శ్రీనివాసాచార్యులు, సీనమ్మ దంపతులకు ప్రస్తుత యాదాద్రి నందలి భువనగిరిలో జన్మించారు. ఉత్తమ విలువలు, ఉన్నత సంస్కారం బాల్యం నుండే అలవరచినారు తండ్రి శ్రీనివాసాచార్యులు. ఉపాధ్యాయ వృత్తి రీత్యా వీరి కుటుంబం గౌలిపుర(ఛత్రినాక) హైదరాబాదు నందు స్థిరపడింది. అక్కడే శేషాచారి విద్యాభ్యాసం కొనసాగింది. ఛాదర్‌ఘాట్ ఉన్నత పాఠశాలలో, సిటీ కళాశాలల్లో చదువు పూర్తి చేశారు.

తెలంగాణకే సరస్వతీ నిలయంగా పేరు గాంచి, ఎందరో మహానుభావుల విద్యాక్షేత్రమైన ఉస్మానియా విశ్వ విద్యాలయంలో మొదటి బ్యాచ్ సివిల్ ఇంజినీర్ పట్టా అందుకున్న ప్రథముడు (1944) శేషాచారి గారు. మాస్టర్ ఆఫ్ ఇంజినీర్ (ఎంఈ) ‘రూర్కీ’ విశ్వవిద్యాలయం ద్వారా పట్టా పొంది, పుట్టిన నేల రుణం తీర్చుకోవడానికి, ఆ నేలను సుభిక్షం చేయాలనే లక్ష్యంతో ప్రణాళికలకు రూపకల్పన చేయడం ఆరంభించారు వీరు.

వెనుకబడిన నా ప్రాంత అభివృద్ధి కోసం నేనేమైనా చేయాలని నిరంతరం కలలు కనేవారు. ఈ ప్రాంతం అన్నపూర్ణగా ప్రజల ఆకలి తీర్చాలంటే రైతన్నలకు సుస్థిర వ్యవసాయానికి సాగునీరు అందించాలని, నీటి పారుదల శాఖలో ఉన్న తాను రైతులకు ఎలా సాయం చేయాలని తపించారు.

వీరు ‘పనియే దైవం’గా భావిస్తారు. నల్గొండ, ఖమ్మం, వరంగల్, నిజామాబాద్ జిల్లాలలో అసిస్టెంట్ మరియు ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్‌గా వివిధ హోదాలలో బాధ్యతలను నిర్వర్తించారు. ఆయా ప్రాంతాల అభివృద్ధి కోసం స్థానిక సమస్యలపై దృష్టి సారిస్తూ, పరిష్కార మార్గాలు సూచించారు. రైతుల ఆర్థిక, సాంఘిక పురోగతి కోసం తనదైన పంథాలో కృషి చేశారు. నీటి వనరులను అభివృద్ధి చేయడం, నీటి వనరులలోని నీటి నిల్వలు పెంచడం, వ్యవ సాయం కోసం రైతుకు సాగునీటిని అందించడం వీరి ప్రధాన ఉద్దేశ్యం.

“ప్రజలకు తాగునీరు, రైతులుకు సాగునీరు” అందించడంతో తన బాధ్యత తీరిపోదని భావించారు. అందుకై సాగునీటి సామర్థ్యాన్ని పెంచుటకు వ్యవసాయ శాఖ అనుబంధంతో వరంగల్ సర్కిల్ ఆఫీసు వెనుక ప్రదర్శన క్షేత్రాలు స్థాపించారు. సాంప్రదాయ రీతిలో వరి పండించే వారు రైతులు. అందుకు భిన్నంగా వాణిజ్య వ్యాపారాభివృద్ధి పెంచడం కొరకు కూరగాయలు, పండ్ల తోటలు పెంచే వినూత్న విధానానికి శ్రీకారం చుట్టారు. ఈ పంటలతో వ్యవసాయాభివృద్ధే కాక వారి ఆరోగ్యానికి తోడ్పడతాయని తలచారు. దీనిద్వారా తక్కువ నీరుతో ఎక్కువ దిగుబడి, తక్కువ ఖర్చుతో ఎక్కువ రాబడి ఉంటుందని ప్రయోగాత్మకంగా చూపిన ప్రాజ్ఞులు వీరు.

అంతేకాదు, సాగునీటి వ్యవసాయంలో నీరు ప్రవహించే మేర కలుపు మొక్కలు పెరిగేవి. ఈ కలుపు, పంటకు నానా రకాల ఇబ్బందులు కలిగించేవి. కలుపు నివారణకై చిన్నచిన్న కాలువలు తీసి, సిమెంట్ వేసి, నీరు వృధా కాకుండా పంటకు చేరేలా చేసిన ప్రథములు వీరే. రైతు పురోభివృద్ధి చెందితే, దేశాభివృద్ధి చెందుతుందన్న విశ్వాసం కలిగిన వారు ఉత్తలూరి వారు. ఎండ సమయంలో నీరు ఆవిరి కావడం, రైతు అలసట చెందుతాడని మోటబావుల ద్వారా నీటిని పంట పొలాలకు ఉదయ సంధ్య వేళల్లోనే అందించాలని సమయాన్ని నిర్ధేశించారు ఈ ఇంజినీరు.

ఇలా వ్యవసాయం అభివృద్ధి చెందితే దుర్భిక్షం పోయి, సుభిక్షం అవుతుందని, నీటి పారుదల శాఖలో ప్రయోగాత్మక ప్రణాళికలను సిద్ధం చేసి రైతులకు శిక్షణను ఇచ్చారు. భారత ప్రభుత్వం వీరి సేవలు వినియోగించుకోవడానికి ఆగ్నేయ ఆసియా దేశాల ఇంజినీర్లకు నిర్వహించిన ఉన్నత శిక్షణకు ఆహ్వానించింది. ఆ సందర్భంగా కేంద్రం నుండి వీరికి ఘనమైన సత్కారం, పారితోషికం అందించి, జాతీయ స్థాయిలో వీరి సేవలను ఉపయోగించు కుంది. అక్కడి శిక్షణలో అత్యాధునిక పరికరాలతో నూతన పద్ధతిలో వ్యవసాయం చేయడం, ప్రాంతీయ వనరులతో సాగు చేయడం, తక్కువ పెట్టుబడితో ఎక్కువ లాభం చేకూర్చే వ్యవసాయో పయోగ కార్యక్రమాలలో వారికి శిక్షణను ఇచ్చారు. వీరు చేసిన ఈ కృషి ఫలితంగా ఉత్తర తెలంగాణయే కాకుండా కృష్ణా జిల్లా రైతన్నల పాలిట వరాలై అనావృష్టి పోయి, ఇంటింటా ఆనందాలు వెల్లివిరిసాయి.

శేషాచారిగారు పనిచేసిన జిల్లాలలో వృత్తి ధర్మాలను నిర్వర్తిస్తూనే బృహత్ ప్రణాళికల ద్వారా శాశ్వత నిర్మాణాల రూపకల్పన చేశారు. తెలంగాణ నీటిపారుదల ప్రాజెక్టు సర్కిల్‌లో భాగంగా, వ్యవసాయాభివృద్ధికై జలాశయాలపై ఆనకట్టలు నిర్మించడానికి వ్యూహరచనలు జరిగా యి. మొదట ‘కిన్నెరసాని’ ప్రాజెక్టు కోసం అడవి మధ్యభాగాన్ని ఎంచుకున్నారు. ఇది ఖమ్మం జిల్లా పాల్వంచ వద్ద ఉన్నది. ఏ ఆనకట్ట నిర్మాణానికైనా కేవలం ఇంజినీర్లు కాకుండా సహాయ మరియు సాంకేతిక సిబ్బంది అవసరము. నిర్మాణ సమ యంలో వీరందరు కుటుంబాలతో ఉండడానికి ప్రాజెక్టు సమీపాన ‘పాల్వంచ’లో అన్ని వసతులతో ఒక కాలనీ నిర్మించారు. వీరి ఆలోచనలకు అప్పటి ప్రభుత్వం సహకారం పూర్తిగా ఉంది. కాలనీవాసులకు తాగునీటి సౌకర్యం, విద్యుత్ సరఫరా(జనరేటర్ ద్వారా) చేయించారు. ఈ కిన్నెరసాని ప్రాజెక్టును ‘పాల్వంచ నుండి యాలం బావి’ వరకు ఏడు వాగులగుండా పది కి.మీ.ల దూరం వరకు రోడ్డు నిర్మించారు. మధ్యలో అడ్డువచ్చే వాగులను కట్టడి చేసి, వంతెనలతో మంచి నాణ్యతగల రోడ్డును వేయించారు. ఈ కిన్నెరసాని ప్రాజెక్టు నిర్మాణ సమయంలో (10 కి.మీ.ల వరకు వేసిన రోడ్డు) ఆనకట్ట నిర్మాణానికి అవసరమయ్యే బరువైన యంత్రాలు, నిర్మాణపు వస్తువులు సులభంగా చేరవేయుటకు ఈ దారి ఉపయోగపడింది.

‘కిన్నెరసాని’ ప్రాజెక్టు ప్రపంచ ఖ్యాతిని ఆర్జించింది. ఇది ప్రపంచంలో అతిపెద్ద మట్టి ఆనకట్టగా పేరుపొందినది. ఈ వంతెన నిర్మాణం ఒక వ్యూహాత్మక ప్రయోజనానికి ఉపయోగపడింది. నిర్ణీత సమయంలో పూర్తిచేసి ‘కిన్నెరసాని’ ప్రాజెక్టు ప్రజల ఉపయోగానికి అందించిన ఘనత ఉత్తలూరు వారిదే.

పాల్వంచ ప్రాంతం అంతా వన్యమృగాలు సంచరిస్తుంటాయి. ఆదివాసులు అభివృద్ధికి నోచుకోక అక్కడే వారు జీవనాన్ని గడిపేవారు. పాల్వంచ నుండి రోడ్డు మార్గం ఏర్పడ్డాక ఆ ప్రాంతం అంతా విద్య, వైద్య, ఆరోగ్య అభివృద్ధికి బాటలు పడ్డాయి. వారి వ్యథలు బాసి పురోభివృద్ధికి నోచుకున్నారు. 1960లో అక్కడి నుండే ఆ ప్రాంతాలలో లభించే వస్తువుల ఉత్పత్తిని ప్రారంభించారు. ప్రజోపయోగ కార్యక్రమాలు చేపట్టి, వాటి అభివృద్ధి సాధనకు కృషి చేయడంలో ఉత్తలూరి వారికి సాటి మరొకరు లేరు.

‘ఆస్తుల సంపాదనకన్నా ఆప్తులను సంపాదించు కోవడం మిన్న’ అని నమ్మిన సిద్ధాంత వాది శేషాచారి గారు. మధ్య తరగతి కుటుంబంలో జన్మించిన వీరు ఉన్నత భావాలతో పెరిగారు. వీరికి ముగ్గురు తమ్ములు, ఒక చెల్లి. ఉమ్మడి కుటుంబంలోని ఉన్నత విలువలను ఉగ్గు పాలతోనే నేర్చినవారు ఉత్తలూరి వారు. అన్నదమ్ముల అనుబంధాలు, అక్కాచెల్లెళ్ల ఆత్మీయతలు, బంధుత్వపు బాంధవ్యాలు, సహజీవనంలోని సహాయాలను సంఘరీతి, ధర్మనీతిని తండ్రి నుండి పుణికి పుచ్చుకున్నారు. అందరిలో తానై, అందరికీ తానై కుటుంబ బాధ్యతలను నిర్వర్తించారు. వీరింట డాక్టర్లుగా, ఇంజినీర్లుగా, శాస్త్రవేత్తలు ఉన్నతంగా ఎదిగారు. తన కుటుంబానికే కాకుండా తోటివారికి సహకరించే గొప్ప గుణం శేషాచారి గారిది. వీరి సేవ చిరస్మరణీయము అని అంటారు.

శేషాచారి గారు బహుముఖ ప్రజ్ఞాశాలి. హిందుస్థాన్, కర్ణాటక సంగీతం, గాత్ర వాయిద్యాలలో మక్కువ ఎక్కువ. పండిట్ రవిశంకర్ గారు మానసిక గురువు. సితార్ వాయించడంలో నిపుణత తెలిసిన విద్వాంసులు. వారు పనిచేసిన ప్రాంతాలలో సంగీతం ప్రోత్సహించే వారు. ముఖ్యంగా వీరు నిజామాబాద్ ‘ఇందూర్ సంగీత సంస్థ’ను అభివృద్ధి చేశారు. వీరి కుమార్తె కీ॥శే॥ మాలికకు విజయనగరం నుండి ‘వీణ’ను తెప్పించి ఖమ్మం జిల్లాలో అభ్యాసం చేయించారు. ౦అలాగే వాహనాల చిరు మరమ్మత్తులు తానే స్వయంగా చేసుకునేవారు. కిన్నెరసాని ప్రాజెక్టు కొత్తది. అడవి ప్రాంతం. డ్రైవర్ పోస్టు మంజూరైన చాలా కాలం డ్రైవర్ లేని కారణంగా వారి వాహనాన్ని వారే చూసుకునేవారు. ప్రాజెక్టు ప్రాంతాలలో హోటళ్లు లేని కారణంగా తోటి సిబ్బంది, వారి కుటుంబాల సఖ్యత పెంచుటకు, ఉత్సాహం నింపుటకు “క్యాండిల్, మూన్‌లైట్ డిన్నర్”లు ఏర్పాటు చేసిన ప్రోత్సాహకులు శేషాచారి గారు.

నిజామాబాద్‌లో కెనాల్ కమాండ్‌లో విస్తృత పర్యటనలు చేశారు. ఈ పర్యటనలో వ్యవసాయపు నేలలో భూగర్భ జలాలు మరియు లవణీయత పెరగడాన్ని, అలాగే సాగునీరు కాలువ చిట్టచివరి రైతు కమతాలకు (పొలాలకు) చేరకపోవడాన్ని గమనించారు. ఈ సమస్యలను అధిగమించడానికి అప్పటి వరల్డ్ బ్యాంక్ ప్రెసిడెంట్ “మిస్టర్ రాబర్ట్ మెన్‌నామారా” గారి ప్రత్యక్ష సహకారంతో ఒక ప్రణాళిక చేపట్టారు. ఈ ప్రణాళికలో వెలువడిన ఫలితాలు సిఫారసు రూపంలో అప్పటి ఏపీ ప్రభుత్వానికి నివేదికరూపంలో సమర్పించారు. ఈ ఆలోచనలకు ముగ్ధులైన రాబర్ట్‌గారు తదుపరి పర్యటనలో ఈ మార్గదర్శకాలు ఇతర కెనాల్ కమాండ్స్ ఉపయోగానికై వీరితో రెండు రోజులు చర్చలు జరిపారు. ఆరోజు వారు వేసిన బాటలే ఈరోజు మార్గదర్శకాలై ఆ పరివాహక ప్రాంతమంతా పచ్చదనంతో నిండి ఉంది. ఇదేనేమో “నేడు నాటిన మొక్క రేపటి మహా వృక్షమై ఫలాలు అందిస్తాయనడం”.

నా ప్రాంతమంతా హరితవనం కావాలి. ఒక రైతు పంటకూడా నష్టం కాకూడదని తపించే వారు శేషాచారి గారు. వ్యవసాయ క్షేత్రాలు అభివృద్ధి చెంది అన్నదాతల కష్టాలు కడతేర్చుటకు కృషి చేశారు. నీటికోసం, వనరుల కోసం కష్టపడకూడదని నీటి నిలువలను పెంపొందించాలని భావించారు. 60సం॥ల క్రితమే ఇంకుడుగుంతల ఆలోచనను చేపట్టారు. బోరు బావులతో, మోట బావులతో సాంప్రదాయ పద్ధతికి భిన్నంగా నూతన పద్ధతిలో వ్యవసాయ అభివృద్ధికై బాటలు వేశారు. తక్కువ నీటిని ఉపయోగించి, ఎక్కువ పంటను పొందే డ్రిప్ (బిందు సేద్యం) మరియు ‘స్ప్రింకిల్’(నీటి జల్లు) విధానాన్ని సాగునీటిలో ప్రవేశపెట్టిన ఆద్యులు వీరే. ప్రభుత్వ ఆమోదంతో దీనిని ప్రయోగాత్మకంగా ప్రభుత్వ మరియు ప్రైవేట్ ఫామ్స్ ఎంచుకున్నారు. మొదటగా “నిజాం షుగర్ ఫ్యాక్టరీలో – సులేమాన్ ఫామ్’(రుద్రూర్ దగ్గర) ఈ నూతన వ్యవసాయ పద్ధతిలో పంటలు పండించేందుకు రైతన్నలకు శిక్షణ ఏర్పాటు చేశారు. అన్నదాతలకు ఈ నూతన పద్ధతి ద్వారా నీటి పొదుపుతో వ్యవసాయం చేయడం నేర్చుకున్నారు. ఆ విధానమే ఈనాడు ప్రతి రైతు అవలంబించి, లబ్ధి చేకూరుటకు వారి ఆలోచనలే పునాదులు.



కేంద్ర ప్రభుత్వ అధికారులతో శేషాచారిగారు

మోక్షగుండం గారిని రోల్ మోడల్‌గా ఎంచుకొన్న వీరు, ఆ బాటలో నడిచి, నిర్మాణాత్మక కార్యక్రమాలను చేపట్టి, వాటి నిర్మాణం చేయుడంలో వీరి ఆలోచనలు సహకరించాయి. ప్రాజెక్టుల నిర్మాణంలో వీరు ప్రధాన సలహాదారులుగా వ్యవహరించారు. ‘కడెం’ ప్రాజెక్టు నిర్మాణంలో కూడా ప్రధాన భూమిక పోషించారు శేషాచారి గారు.

శ్రీరాంసాగర్ (పోచంపాడ్) మేజనరీ డామ్ ఇంజినీర్‌గా వ్యవహరించే సమయంలో వీరు పడిన తపన, చేసే దీర్ఘకాలిక, నిర్మాణాత్మక వ్యూహాలు భవిష్యత్తుకు బాటలు వేశాయి. పోచంపాడ్ ప్రాజెక్టు నిర్మాణ సమయంలో గడియారంలోని ముల్లులా అహోరాత్రులు శ్రమించి, నాణ్యమైన పనితనంతో నిర్మించారు. ఈ రాతి ఆనకట్టను నిర్ణీత కాలంలో ఆ నీటిని విడుదల చేయడంలో తన ప్రాణాన్నే పణంగా పెట్టారు. ప్రభుత్వం ఆనకట్ట నిర్మాణానికి కేటాయించిన నిధులలో కోట్ల రూపాయలు మిగిల్చారు. ఆ రొక్కాన్ని ప్రభుత్వ ఖజానాకు జమచేసి తన నిజాయితీని నిలబెట్టుకున్న కార్యదక్షుడు ఉత్తలూరి వారు. నాటి ప్రధాని శ్రీమతి ఇందిరాగాంధీచే ప్రశంసలు అందుకున్న మహోన్నత వ్యక్తిత్వం. వీరు నీరు విడుదల ప్రారంభోత్సవానికి ముందురోజే తుదిశ్వాస విడిచారు. ఈ వార్త తెలిసిన ప్రధాని ఆ ఆరంభాన్నే వాయిదా వేయమన్నారు.

పోచంపాడ్ పరీవాహక ప్రాంతమంతా పచ్చద నంతో నిండి, రైతుల కళ్లల్లో వెలుగులు చూడాలని తపన పడ్డారు శేషాచారిగారు. కృషీవలుర కష్టాలు కడదేరి, ఇళ్లల్లో గాదెలు నిండాలని అభిలషించారు. తెలంగాణ ప్రాంతంలో ఏ రైతు కూడా సాగు, త్రాగునీటికై కృంగి పోకూడదని తపించారు. కానీ తానుకన్న కల సాకారమైంది. తాను కళ్లారా చూడకుండానే ఆ నేలలోనే తుదిశ్వాస విడిచారు. అక్కడే తాను నిర్మించిన రామాలయంలో సీతారామ లక్ష్మణ విగ్రహాల చెంత మమేకమై హరిత వనాలను, జలాశయాలను వీక్షిస్తున్నారు.

ఆనాటి వారి ఆలోచనలు, ప్రణాళికలు ఈనాడు తెలంగాణ ప్రభుత్వ ప్రాజెక్టుల నిర్మాణాలకు ఎంతగానో తోడ్పడుతున్నాయి. వీరి సేవ మన తెలంగాణకే నిర్మాణాత్మకమైన సంపద. రైతుల మనసెరిగిన వ్యక్తిగా ప్రాజెక్టు నిర్మాణాన్ని పూర్తిచేసి నేటికి (1వ తేదీ జులై 1970) 50 సం॥లు పూర్తి అయినది. ఆశయ సాఫల్యం పొంది, ఆనకట్టపై ప్రాణం వదిలిన శేషాచారిగారు అర్ధ శతాబ్దంగా పవిత్రాత్మ ఆ ప్రాంతంలోనే నడయాడుతున్నది. వారి ఆలోచనలు, ఆశయాలు నేటి తరానికి ఎంతో స్ఫూర్తిదాయకం.

“విత్తు ఒకటి పెడితె చెట్టు మరొకటి పుట్టదుగా” అన్నట్లు వీరికి ఒక కూతురు మాలిక(ఫార్మకాలజీ), ఐదుగురు తనయులు. డా॥ రాజా, కిషోర్, విజయ్, అశోక్, డా॥శ్రీను. వీరు ఎంచుకున్న రంగాలలో ప్రవీ ణ్యులై తండ్రి బాటన నడుస్తున్నారు.

రైతుకు పాడి, పంటలు సంపదలు. శేషాచారి గారి పెద్ద కుమారుడు ప్రొఫెసర్ డా॥ వి.రాజా వ్యవసాయ రంగంలో అనేక నూతన విధానాలకు రూపకల్పన చేస్తూ రైతులను ప్రగతి బాటన నడిపిస్తున్నారు. ‘స్వీట్ కార్న్’ మరియు ‘బేబీ కార్న్’ వంగడాన్ని కనుగొన్న శాస్త్రవేత్తలలో ఒకరు రాజాగారు. ప్రైవేటు సంస్థలలో నిర్మాణపు పనుల పర్యవేక్షణ చేశారు కిషోర్. మహారాష్ట్ర విద్యుచ్ఛక్తి శాఖలో ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్‌గా బాధ్యతలు నిర్వర్తించారు విజయ్. తెలంగాణ డెయిరీలో జనరల్ మేనేజర్‌గా (క్రికెటర్) పనిచేస్తూ, పాడి రైతుల మద్దతు ధర, సంస్థను ప్రైవేటీకరణ ఆపుదల, కొత్త ప్రాజెక్టుల రూపకల్పన చేస్తున్నారు మరో తనయుడు అశోక్. వైద్య సేవలో జాతీయ స్థాయిలో పేరు పొందారు డా॥ శ్రీను. వీరు రొమ్ము క్యాన్సర్ వ్యాధి నివారణలో అధు నాతన సర్జరీ పద్ధతులను కనిపెట్టిన వైద్య శాస్త్రవేత్త.

వీరి కుటుంబంలో ఎక్కువ శాతం ఇంజనీర్స్, కొందరు వైద్యులు. చేసే వృత్తులు ఏవైనా ప్రవృత్తులు మాత్రం తండ్రి బాటన నడిచి, దేశ సేవచేస్తూ, జాతిసేవకు అంకితమైన మానవతా మూర్తులు.

***(శేషాచారి గారి అర్ధ శతాబ్ధి వర్ధంతి సందర్భంలో....)***



**–డా.శ్రీభాష్యం అనూరాధ**
8790325502



కిన్నెరసాని ప్రాజెక్టు పరిశీలించడానికి విచ్చేసిన కేంద్ర బృందంతో శేషాచారి.

## కరోనాపై...నానీలు

బడుగుల జీవితాల్లో
వెలుగు నింపుదాం
భృతి కల్పించే
మార్గమెతుకుదాం

వింత పోకడలు
వింత రోగాలు
చేస్తున్నాయి
లోకాన్ని అతలాకుతలం

సంపన్న దేశాల
ఆయుధాలు
కరోన ముందు
బలాదూరు

విర్రవీగిన
అగ్ర దేశాలు
అర్థిస్తూ
దిక్కుతోచక నేడు

ప్రకృతి నేర్పిన
గుణపాఠం
కావాలి ముంమ్ముందు
హితకారి

నేను నాదనే
గర్వాన్ని నరికావు
ఇకనైన చాలించు
ఉగ్రరూపం

ఎంత కాలమిలా
బలి తీసుకుంటావు
ఇకనైనా
మరలిపోవా

వ్యాప్తి చేసే
కరోనా జీవి
హద్దుల్లో మేమున్నా
బుద్ధిగా వుండవెందుకు

మానని గాయాలు
చేస్తున్నావు
అడుగు బయటెడితే
అంతం చేస్తున్నావు

తెల్ల కోటుకు
దండాలెడదాం
వారికి శ్రమివ్వకుండా
జాగ్రత్తగా ఉందాం

ఏకాకి శవాలు
ఇంకెన్నాళ్ళు
మానవత్వం
బయల్పడేదెన్నడు

కలాన్ని
కరవాలంగా మార్చాలి
కరోనాపై
సమరభేరి మోగించాలి

భయం భయంగా
జీవన యానం
పొట్ట తిప్పల కోసం
తప్పని పయనం

కోవిడ్ మహమ్మారి
కబలించింది
మండే ఎండ
ఏమి చేయలేకపోయింది

లాక్ డౌన్
సడలించింది
పురుగుకి లొంగిన
ప్రపంచ దేశాలు

కరోనా ఉగ్రరూపం
చూపిస్తున్నది
మనిషి
నిస్సహాయుడయ్యాడు

జీవితం నిరాశ
కానీయకు
కోవిడ్ సంకెళ్ళు
తెగ నరుకు

సాంకేతిక సాధనలో
ముందున్న దేశాలు
కరోనా దాటికి
కకావికలం

చీకట్లు తరిమే
యుద్ధం చేద్దాం
భవిష్యత్తుకు
బాటలు వేద్దాం

భారమాయెను
బతుకులు
ఎన్ని మారినా
మారని తలరాతలు

స్వీయ నిర్బంధంలో
ఉందాం
కరోనాకు
రిటర్న్ గిఫ్ట్ ఇద్దాం

ప్రపంచమంతా
ఒక సూక్ష్మజీవి
ముందు
తలకిందులయ్యింది

కాల మహిమను
పరికిద్దాం
కరోనాలెన్నోచ్చినా
ఎదుర్కొందాం

ఓర్పన్నది
ఎంత అవసరమో
నేర్పిన కరోనా
మమ్మల్ని పరీక్షించకు

ప్రపంచం మొత్తం
శుభ్రత అంటుంది
కరోనా మాత్రం
వెళ్ళనంటుంది

మహమ్మారి తెచ్చిన
అలజడిలోన
కాలం మునకలు
వేస్తుంది

ప్రకృతి తిరుగుబాటు
ఫలితమిది
ప్రకృతిని
పూజించి తరముదాము

విదేశీ వైరస్
అంటకుండా చూసుకో
విశ్వాన్ని వణికించే
క్రిమికి దూరంగా ఉండు

చావు డప్పులు
వినపడుతున్నాయి
మనదాకా రాదని
విర్రవీగకు

మనుగడను
అపహాస్యం చేసింది
నీ బలం ఏమిటో
నిరూపించుకోమంది

పాపం ఎవరు
చేస్తే నేమి
యమపాశమై అందర్నీ
చుట్టుకుంటుంది

ప్రతి ఒక్కరు
ఒక శక్తిగా మారుదాం
పోరాడి
ఎదుర్కొందాం

మృత్యు గీతాన్ని
ఆలపిస్తూ కరోనా
నీ రాగం ఇంక
సాగదు

సమూహంగా వారి
సమాజ శక్తి నిరూపిస్తాం
నిన్ను అంతం
చేస్తాం

మౌన పోరాటం
ఇంకెనాళ్ళు
ఈ చిక్కు ముడి
వీడేదెన్నడు

లోకమంతా
తలకిందులు చేస్తుంది
నిషబ్దయుద్ధం
సాగుతోంది

మనుషులను
మృగాలుగా చేస్తుంది
దయ జాలి
మాయం చేస్తుంది

మేఘాలు
మూకుమ్మడి దాడిలా
వచ్చినది
మాయల మరాఠి

మానవ తప్పిదాలకిది
పెను మూల్యం
ఇకనైన
జర భద్రం

పిచుకలు నాడు
సమిదయ్యాయి
పట్టించుకోలేదు
అనుభవించమంది

బందిఖానలోంచి
వచ్చామనుకోకండి
ఏమరపడ్డావో
మృత్యుముఖమే

మృత్యు గంటలు
మ్రోగుతున్నాయి
గుడి గంటల
తొందరెందుకో

కలవకుంటేనే
నేడు సుఖం
కలుసుకున్నామో
కరోనా చేత చిక్కామే

మూకుమ్మడి దాడి
చేసింది
ఊపిరి
లేకుండా చేస్తుంది

విర్రవీగిన
మనిషి మేదకు
భయంకరమైన
గుణపాఠం ఇది

ఆగనిది
ఈ యుద్ధము
ధరించక తప్పదు
ఆయుధాలు

ధైర్య కవచాన్ని
ధరించాలి
కథనరంగంలో
వీరునిలా నిలబడు

లాక్‌డౌన్ తో
పని పడదామనుకున్నాం
నీ పనింక
ముగిసిందన్నావు

భూమాత గోడు
నిర్లక్ష్యఫలితమిది
అనుభవించాలి
తప్పదు మరి

ఊపిరితిత్తుల
నాశన కారి
వినాశనమే
దీని పరమావధి



**- సునీత బండారు**
9440671530

## ఎప్పుడైనా అనుకున్నారా ?

ఎప్పుడైనా అనుకున్నారా ?
మన చేతులే మనకు శత్రువులు అవుతాయని ,
ఎన్నడైనా కలగన్నారా
మన ముక్కు, నోరు
మన జీవితానికి చరమగీతం పాడుతాయని ..
ఎప్పుడైనా అనుకున్నామా?
అతిథులెవ్వరూ మన ఇంటికి
రాకూడదని కోరుకుంటున్నామని...
ఏనాడైనా కలగన్నామా?
పెళ్ళిళ్ళు, పేరంటాలే కాదు..
చస్తే కడసారి చూపులకు కూడా నోచుకోలేక...
తనవారిని దూరం అవుతున్నామని..
ఎప్పుడైనా అనుకున్నామా?
ఒక్కోసారి తన కుటుంబ సభ్యులే
తనను శత్రువు లా చూస్తారని..
ఎంతపని చేసావే కరోనా.
మనుషులకు బంధాలు ,అనుబంధాలను
దూరం చేస్తున్నావు..
ఇక మానవాళిని దూరం చేసేలా వున్నావు..
ఓ కసాయి కరోనా! నువ్వెంత చెలరేగినా మేము
మా పరిశుభ్రతా అస్త్రం తో నిన్ను అంతం చేస్తాం ..
వాక్సిన్ తెచ్చేలా కృషి చేసి ..
సామాజిక దూరంతో
నిన్ను సమూలంగా నాశనం చేస్తాం.

–వేముల ప్రేమలత,

**నేటినిజం** చందా వివరాలు

ప్రతి వారం ప్రచురిస్తున్న ‘సాహితీ కెరటాలు’ గల ‘నేటినిజం’ 260 సంచికలు + పోస్టల్ ఛార్జీలు కలుపుకుని **5** సం॥రాలకు రూ.**700/–**, **10** సం॥రాలకు రూ **1200/–** మీ చందాను ‘నేటినిజం‘ తెలుగు దినపత్రిక పేరిట ఎం.ఓ. లేదా డిడిగానీ, ఈ క్రింది అడ్రసుకు పంపగలరు. లేదా SBI 3056 7652 629, IFSC: SBIN 0011660
Gandhi Nagar Branch Hyderabad-80 అకౌంట్‌లో వేయవచ్చును.

‘నేటినిజం’ దినపత్రిక, ఎస్ఆర్‌టి–74, జవహర్‌నగర్, హైదరాబాద్–500 020.

## ఇలా ఎంతమందో..

ఉపాధి కోసం
ఉదరం కోసం
ఓ చేత్తో తట్టా.. బుట్టా సర్దుకుని
మరో చేత్తో పిలాడ్ని చంకనెట్టుకుని
పెనిమిటి భుజాలపై
ఇద్దరి పిల్లల్ని ఎత్తుకుని
సంసార భారం మోస్తూ
ఎండ మండుతుంటే
అరికాళ్ళు సల సల కాగుతుంటే
నాలుక పిడచ కట్టుకు పోతుంటే
పిల్లలు ఆర్త నాదాలు చేస్తుంటే
వారి గుండెలు తరుక్కుపోయాయి
కన్నీళ్లే దాహం తీర్చాయి
అలసి..సొలసి పోయారు
కుప్ప కూలిపోయారు
కరోన కాటుకు
కుటుంబ మంతా
విగత జీవులైనారు
ఎక్కడి వారు వీరు
ఇలా ఎంత మందో
ఎక్కడెక్కడ ఉన్నారో
ఏమైపోతున్నారో
కరోన కాలం
ఛిద్రం చేస్తోంది జీవితాలను

**–కనుమ ఎల్లారెడ్డి**
93915 23027

## నేటి నిజాలు



# నాటి సభలు, సమావేశాలు...

జూన్ 23 నుండి జులై 1 వరకు

## జూన్ 24

జ్ఞాపకాలు



జూన్ 24, 2019న త్యాగరాయ గానసభలో ప్రముఖ సాహితీవేత్త పాలగుమ్మి పద్మరాజు జయంతి సభలో పాల్గొన్న శ్రీమతి సుజారమణ, కళా జనార్ధనమూర్తి, సాహిత్య అకాడమీ కార్యదర్శి డా॥ ఏనుగు నరసింహారెడ్డి, నేటినిజం సంపాదకులు బైస దేవదాసు.



సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో బిక్కి కృష్ణ రచన 'కాలం నడిఒడ్డున' పుస్తకావిష్కరణ సభలో హైకోర్టు న్యాయమూర్తి, జస్టిస్ చల్లాకోదండరాంగారితో డా॥ ఎన్.గోపి, బైస దేవదాసు, బిక్కి కృష్ణ, ఎల్వీ చౌదరి.

## జూన్ 25

జ్ఞాపకాలు



జూన్ 25, 2017న రవీంద్రభారతి కాన్ఫరెన్స్ హాలులో ఆచార్య ఎన్.గోపి రచించిన "జీవన భాష" కవితా సంపుటి ఆవిష్కరణ సభలో ప్రసంగిస్తున్న డా॥ ఓలేటి పార్వతీశం. వేదికపై నేటినిజం సంపాదకులు బైస దేవదాసు, ఆచార్య టి. మోహన్ సింగ్, మామిడి హరికృష్ణ, సీనియర్ పాత్రికేయులు కె.రామచంద్రమూర్తి, డా॥ ఎన్. గోపి, డా॥ వై. రామకృష్ణ, సీతారాం.



జూన్ 25, 2017న రవీంద్రభారతి కాన్ఫరెన్స్ హాలులో ఆచార్య ఎన్.గోపి రచించిన "జీవన భాష" కవితా సంపుటి ఆవిష్కరణ సభలో ప్రసంగిస్తున్న డా॥ ఎన్.గోపి.

## జూన్ 26

జ్ఞాపకాలు



జూన్ 26, 2011న రవీంద్రభారతిలో ధర్మకేతనం సాహిత్య కళాపీఠం ఆధ్వర్యంలో ఎన్వీ రఘువీర్ ప్రతాప్ రచన 'అవ్యక్త' గ్రంథావిష్కరణ సభలో ఎన్వీ రఘువీర్ ప్రతాప్, డా॥ ఎం. కాంతారావు, ఐ.పి.ఎస్., ఆచార్య శరత్ జ్యోత్స్నారాణి, ఆచార్య కొలకలూరి ఇనాక్, ఆవిష్కర్త ప్రముఖ సినీనటులు రంగనాథ్, నేటినిజం సంపాదకులు బైస దేవదాసు, ప్రముఖ రచయిత సుధామ.



జూన్ 26, 2011న 'అవ్యక్త' గ్రంథావిష్కరణలో నేటినిజం దినపత్రిక సంపాదకులు బైస దేవదాసును సత్కరిస్తున్న ఆచార్య కొలకలూరి ఇనాక్, 'అవ్యక్త' రచయిత ఎన్వీ రఘువీర్ ప్రతాప్.

## జూన్ 26

జ్ఞాపకాలు



జూన్ 26, 2011న రవీంద్రభారతిలో ధర్మకేతనం సాహిత్య కళాపీఠం ఆధ్వర్యంలో ఎన్వీ రఘువీర్ ప్రతాప్ రచన 'అవ్యక్త' గ్రంథావిష్కరణ సభలో ఎన్వీ రఘువీర్ ప్రతాప్, డా॥ ఎం. కాంతారావు, ఐ.పి.ఎస్., ఆచార్య శరత్ జ్యోత్స్నారాణి, ఆచార్య కొలకలూరి ఇనాక్, ఆవిష్కర్త ప్రముఖ సినీనటులు రంగనాథ్, నేటినిజం సంపాదకులు బైస దేవదాసు, ప్రముఖ రచయిత సుధామ.



జూన్ 26, 2011న 'అవ్యక్త' గ్రంథావిష్కరణలో నేటినిజం దినపత్రిక సంపాదకులు బైస దేవదాసును సత్కరిస్తున్న ఆచార్య కొలకలూరి ఇనాక్, 'అవ్యక్త' రచయిత ఎన్వీ రఘువీర్ ప్రతాప్.

## జూన్ 27

జ్ఞాపకాలు



జూన్ 27, 2019న రవీంద్రభారతిలో యువకళా వాహిని ఆధ్వర్యంలో వాస్తుశిల్పి డా॥బి.యన్. రెడ్డి జయంతి సందర్భంగా డా॥ కసిరెడ్డి వెంకటరెడ్డికి 'బి.యన్. సాహితీ పురస్కారం' ప్రదానం చేస్తున్న సభలో తిలక్, బైస దేవదాసు, డా॥ పాలకుర్తి మధుసూధన్, డా॥ నందిని సిధారెడ్డి, ఆచార్య శరత్ జ్యోత్స్నారాణి, సుధామ, వై.కె.నాగేశ్వరరావు.



ఆచార్య కడారు వీరారెడ్డి "మేఘాల తీరాన", "విశ్వ నయన" పుస్తకాల ఆవిష్కరణ సభలో బైస దేవదాసును సత్కరిస్తున్న రాష్ట్ర పబ్లిక్ సర్వీస్ సమీషనర్ ఆచార్య ఘంటా చక్రపాణి, ఆచార్య కడారు వీరారెడ్డి.

## జూన్ 28

జ్ఞాపకాలు



జూన్ 28, 2012న కళా సుబ్బారావు కళావేదికలో శ్రీ కిరణ్ సాంస్కృతిక సమాఖ్య ఆధ్వర్యంలో ఇ.యన్.టి.సర్జన్ (రి) డా॥ కె.రాజ నరసింహులుకు శ్రీమతి ఏకా పద్మ స్మారక పురస్కారం ప్రదానం చేస్తున్న శ్రీమతి భాను, బైస దేవదాసు, ఆచార్య శరత్ జ్యోత్స్నా రాణి, డా॥ వెంకట్‌రావు, ఏకా నాగరాజు రామమోహన్‌రావు, డా॥ కళా వేంకట దీక్షితులు, ఎల్వీ సుబ్రహ్మణ్యం తదితరులు.



జూన్ 28, 2012న కళా సుబ్బారావు కళావేదికలో శ్రీ కిరణ్ సాంస్కృతిక సమాఖ్య ఆధ్వర్యంలో శ్రీమతి ఏకా పద్మ స్మారక పురస్కారం ప్రదానం చేస్తున్న సభలో ప్రసంగిస్తున్న నేటినిజం దినపత్రిక సంపాదకులు బైస దేవదాసు.

## జూన్ 29

జ్ఞాపకాలు



జూన్ 29, 2006న రాష్ట్ర సమాచార శాఖ మంత్రి ఆనం వివేకానంద రెడ్డిని కలిసిన రాష్ట్ర చిన్న, మధ్య తరహా దినపత్రికల అసోసియేషన్ అధ్యక్షులు కె.యన్. రంగసాయి, ప్రధాన కార్యదర్శి బైస దేవదాసు. సభ్యులు యస్.యన్. మూర్తి, శ్రీనివాస్.



జూన్ 29, 2011న ప్రముఖ సినీ నటుడు రంగనాథ్ నివాసంలో రంగనాథ్‌తో బైసదేవదాసు.

## జూన్ 30

జ్ఞాపకాలు



జూన్ 30, 2019న తెలంగాణ సారస్వత పరిషత్తులో తెలంగాణ రచయితల సంఘం 3వ రాష్ట్ర మహాసభలో బైస దేవదాసు సంపాదకత్వంలో వెలువడిన "నీళ్ళ గోస" కవితా సంకలనం ఆవిష్కరణలో డా॥ నాళేశ్వరం శంకరం,డా॥.వి. శంకర్, శ్రీమతి బైస వీణ, బైస దేవదాసు, ఆవిష్కర్త 'సాక్షి' ఎడిటోరియల్ డైరెక్టర్ కె. రామచంద్రమూర్తి, సాహిత్య అకాడమీ అధ్యక్షులు డా॥నందిని సిధారెడ్డి, గంభీరావుపేట యాదగిరి, ఘనపురం దేవేందర్, కందుకూరి శ్రీరాములు.



సభలో ప్రసంగిస్తున్న నేటినిజం దినపత్రిక సంపాదకులు బైస దేవదాసు. వేదికపై డా॥ నాళేశ్వరం శంకరం, సాక్షి ఎడిటోరియల్ డైరెక్టర్ కె. రామచంద్రమూర్తి, సాహిత్య అకాడమీ అధ్యక్షులు డా॥నందిని సిధారెడ్డి

## జులై 1

జ్ఞాపకాలు



జులై 1, 2008న జూబ్లీ హాలులో జరిగిన సమావేశంలో నేటినిజం దినపత్రిక సంపాదకులు బైస దేవదాసుకు ఆరోగ్యశ్రీ కార్డు అందజేస్తున్న ముఖ్యమంత్రి వై.యస్.రాజశేఖర రెడ్డి. వేదికపై సీనియర్ జర్నలిస్టు దేవులపల్లి అమర్, మంత్రివర్యులు బొత్స సత్యనారాయణ, రాష్ట్ర సమాచార శాఖ కమీషనర్ డా॥ కె.వి.రమణాచారి.



2014లో కళా సుబ్బారావు కళావేదికలో జరిగిన ఒక సభలో డా॥ సినారెను సత్కరిస్తున్న బైస దేవదాసు.

## నాకే

ఏయ్ రమా
స్వీకరిస్తే
సద్గుణాలను
స్వీకరించు.....!

ఈదాలనుకుంటే
జ్ఞానసాగరాన్ని
ఈదు......!

నడవాలనుంటే
సన్మార్గాన
నడువు......!

పంచాలనుంటే
మానవతను
పంచు......!

మాట్లాడాలనుంటే
నిజాలను
మాట్లాడు....!

వినాలనునుంటే
మంచినిపెంచే
మాటలు విను .....!

పొందాలనుకుంటే
ఎదుటివారి గుండెలో
స్థానాన్నిపొందు ....!

నిలపాలనుంటే
జాతి గౌరవాన్ని
నిలుపు.......!



-రమాదేవికులకర్ణి
8985613123

అబద్ధం నది లాంటిది
తియ్యగా ఉంటుంది
'సత్యం' సాగరం వంటిది
చేదుగా ఉంటుంది
తాత్కాలిక విజయాలెన్ని పొందినా
అంతిమంగా నదులన్నీ సముద్రంలో
కరిగిపోవాల్సిందే...!



-ముదిమడుగుల రాజారావు
7013577140

# అటవీక్షేత్రాల రక్షణ మనందరి బాధ్యత

## కలప అక్రమ రావాణ చేస్తే కఠిన చర్యలు
## ప్రతి ఒక్కరు మొక్కలు నాటి రక్షించాల్సిందే
## -మంత్రి ఇంద్రకరణ్ రెడ్డి

ఆదిలాబాద్,జులై 1(ఆర్ఎన్ఎ): అటవీక్షేత్రాల రక్షణ మనందరి బాధ్యత అని, కలప అక్రమ రవాణాకు సంబంధించి అధికారులకు సమాచారం అందివ్వాలని మంత్రి ఇంద్రకరణ్ రెడ్డి సూచించారు. అడవులను నరికే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఆదిలాబాద్‌లోని మావల పార్కులో పర్యావరణ విజ్ఞాన కేంద్రాన్ని మంత్రి ప్రారంభించారు. హరితహారంలో భాగంగా మావల హరితవనం నుంచి చాందా–టీ వరకు రోడ్లకు ఇరువైపులా ఒకేరోజు లక్ష మొక్కలు నాటనున్నారు. హరితహారంలో ఐదు విడతలుగా నాటిన మొక్కల్లో 70 శాతం బతికున్నాయని చెప్పారు. ఆరో విడత హరితహారంలో 30 కోట్ల మొక్కలు నాటనున్నామని తెలిపారు. ఈసారి నాటే మొక్కల్లో 85 శాతం బతకాలన్నారు. 'హరితహారం'లో పెద్ద సంఖ్యలో పాల్గొని, విజయవంతం చేయాలని సూచించారు. పర్యావరణ పరిరక్షణ కోసం ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలని సూచించారు. అంతరించిపోతున్న వన సంపదను పెంచడంలో ప్రతి ఒక్కరూ ముందుకు రావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యేలు జోగు రామన్న, రాథోడ్ బాపురావు పాల్గొన్నారు. ఇదిలావుంటే అడవి తల్లి ఒడిలో సేద తీరే ఆదివాసీలు హరిత లక్ష్యాన్ని గుర్తించారు. మొక్కల పెంపకంతోనే బతుకు బాగుంటుందని నమ్మారు. అడవినే దైవంగా నమ్మే ఆదివాసీలు ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన ఆరో విడత హరితహారం కార్యక్రమంలో ఆదివాసీ గ్రామాల ప్రజలు ఉత్సాహంగా పాల్గొంటున్నారు.

జిల్లాలోని ఇంద్రవెల్లి మండలం వడగాం చెందిన ఆదివాసీ గూడెం గిరిజనులు మంగళ హారతులతో తమ సంప్రదాయ వాయిద్యాలు డోలు, తుడుం వాయిస్తూ మొక్కలు నాటే కార్యక్రమం నిర్వహించి ఆదర్శంగా నిలుస్తున్నారు. హరితహారంలో తామ స్వచ్ఛందంగా భాగస్వాములు అవుతున్నా మని గ్రామ పటేల్ లక్ష్మణ్ తెలిపారు. గ్రామస్తులు అందరం కలిసి హరితహారం కార్యక్రమం నిర్వహించడంతో వాటిని కాపాడే బాధ్యత సైతం తమపై ఉంటుందని ఆయన తెలిపారు.

# రైతుబంధుకు 7వేల కోట్లు కేటాయింపు

## ఏకకాలంలో అందించిన ఘనత సిఎం కెసిఆర్‌ది
## వ్యవసాయ శాఖ మంత్రి నిరంజన్ రెడ్డి

వనపర్తి,జులై1(ఆర్ఎన్ఎ): ప్రపంచంలో ఎక్కడ లేని విధంగా 36 గంటల్లో రైతులకు రూ.7వేల కోట్లను అందించిన ఘనత సీఎం కేసీఆర్‌కే దక్కుతుందని వ్యవసాయ శాఖ మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి అన్నారు. రైతుబంధు కోసం వెంటనే నిధుల విడుదల చేసి పెట్టుబడి సాయం అందించామని అన్నారు. జిల్లా కేంద్రంలోని తన క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ నాలుగో విడత రైతుబంధు ద్వారా ఇప్పటి వరకు 55 లక్షల 6వేల మందికి రైతుబంధు సహాయాన్ని వారి ఖాతాల్లో జమ చేశామన్నారు. ఇతం పెద్ద మొత్తంలో రైతులకు ఆర్థిక స్వాబంలన కల్పించినందుకు రాష్ట్ర రైతాంగం తరుపున సీఎం కేసీఆర్‌కు కృతజ్ఞతలు తెలుపుతున్నాని చెప్పారు.

ఆకలిదప్పుల తెలంగాణ నుంచి అన్నపూర్ణ తెలంగాణగా మార్చిన ఘనత సీఎం కెసీఆర్ దక్కుతుందని మంత్రి అన్నారు. రాష్ట్రంలో కోటి 50లక్షల ఎకరాల సాగు భూమికి రైతుబంధు పథకం ద్వారా ఆర్థిక సహాయం అందించినందుకు చాలా సంతోషంగా ఉందని తెలిపారు. ఇప్పటి వరకు 28వేల ఖాతాల రైతులకు రైతుబంధు సహాయం ఖాతాల వివరాలు సరిగ్గా లేనందున పంపిణీ చేసిన నగదు వాపస్ వచ్చిందని మంత్రి తెలిపారు. రైతుబంధు పొందని రైతులందరు తమ ఖాతాల వివరాలను పేర్లను, సరిచేసి సంబందిత వ్యవసాయ అధికారులకు అందించి రైతుబంధు సహాయాన్ని పొందాలని సూచించారు.రైతుబంధు సహాయం రైతులకు అందేందుకు కృషి చేసిన వ్యవసాయ, ఆర్థిక శాఖ కార్యదర్శులు, సిబ్బందికి మంత్రి నిరంజన్ రెడ్డి అభినందనలు తెలియజేశారు. కార్యక్రమంలో జడ్పీ చైర్మన్ లోకనాథ్ రెడ్డి, మున్సిపల్ చైర్మన్ గట్టుయాదవ్, వైస్ చైర్మన్ వాకిటి శ్రీధర్, కౌన్సిలర్లు , టీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

## హరిత తెలంగాణ కోసం కృషి: ఎమ్మెల్యే

జగిత్యాల,జులై1(ఆర్ఎన్ఎ): హరిత తెలంగాణ కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఎమ్మెల్యే కల్వకుంట్ల విద్యాసాగర్‌రావు సూచించారు. ఇప్పుడు మొక్కలు నాటి వాటిని ఏడాదంతా సాకడానికి కృషి చేయాలన్నారు. అప్పుడే మొక్కలు బతికి తెలంగాణ పచ్చబడుతుందని అన్నారు. హరితహారం జోరుగా సాగుతోందని, ప్రతి ఒక్కరూ సామాజిక బాధ్యతగా మొక్కలు నాటి సంరక్షణ చర్యలు తీసుకోవాలన్నారు. హరితహారంలో కోరుట్ల నియోజకవర్గాన్ని మొదటి స్థానంలో నిలుపడమే ధ్యేయంగా మొక్కలు నాటే కార్యక్రమాన్ని ప్రతిష్టాత్మకంగా తీసుకుంటున్నట్లు చెప్పారు. పర్యావరణ సమతుల్యతను కపాడాలనే లక్ష్యంతో టీఆర్ఎస్ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న హరితహారం కార్యక్రమం అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వ యంతో కలిసి పని చేస్తేనే విజయవంతం అవుతుందని పేర్కొన్నారు. మొక్కలు నాటేందుకు ఇప్పటికే స్థలాలను గుర్తించా మన్నారు. నాటిన ప్రతి మొక్కనూ సంరక్షి ంచడంపై ప్రత్యేక దృష్టి సారించనున్నట్లు తెలిపారు.

# కల్లాల నిర్మాణంపై రైతుల్లో ఆసక్తి

## శాశ్వతంగా సమస్యలు తీరుతాయని వెల్లడి

కామారెడ్డి,జులై 1(ఆర్ఎన్ఎ): ప్రభుత్వం చేపట్టిన కల్లాల నిర్మాణంపై రైతులు ఆసక్తి చూపుతున్నారు. తమకు ప్రయోజకారిగా ఉంటాయని అంటున్నారు. శాశ్వత కల్లాల నిర్మాణానికి లబ్దిదారుల ఎంపికకు గ్రామపంచాయతీల వారీగా చేయనున్నారు. తమ పంట పొలాల్లో కల్లాలు నిర్మాణం చేసుకునే ఆసక్తిగత అర్హులైన రైతులు తమ గ్రామపంచాయతీ కార్యదర్శికి తమ భూమి వివరాలతో దరఖాస్తు చేసుకోవాలి. ఈ గ్రామ పంచా యతీకి కేటాయించిన యూనిట్ల కంటే దరఖాస్తులు ఎక్కువగా వస్తే లాటరీ ద్వారా ఎంపిక చేయనున్నారు. పంచాయతీ స్థాయిలో అర్హుల జాబితాలను ఎంపీడీవో, ఏవో, ఏపీడీ క్షేత్రస్థాయిలో పరిశీలించిన అనంతరం కలెక్టర్‌కు నివేదిస్తారు. అనంతరం కలెక్టర్ అనుమతి ఉత్తర్వులను మంజూరు చేస్తారు. ఆ తర్వాత ఉపాధి హామీ సిబ్బంది ప్రతిపాదిత శాశ్వత కల్లం నిర్మాణ కొలతలను తీసుకుని అంచనాలను రూపొందించి పను లను ప్రారంభిస్తారు. ప్రభుత్వం ఆమోదించిన ప్రకారమే నిర్మాణాలు చేపట్టాల్సి ఉంటుంది. జిల్లా వ్యాప్తంగా శాశ్వత కల్లాల నిర్మాణానికి రూ.38 కోట్లు మంజూరు చేసింది. ఉపాధి హామీ పథకంలో నిర్మించే ఈ శాశ్వత కల్లాలను మూడు సైజులుగా నిర్మించడానికి డిజైన్లు రూపొందించారు. భూమి గల స్వయం సహాయక సంఘాల సభ్యులు, రైతులు కల్లాల నిర్మాణం చేసుకోవడానికి అర్హులు. ఎస్సీ, ఎస్టీ రైతులకు ఉచితంగా కల్లాలను మంజూరు చేస్తారు. ఇతరులు 10శాతం చెల్లించాల్సి ఉంటుంది.

రైతుల ధాన్యం ఆరబోత కష్టాలకు శాశ్వత పరిష్కారం దక్కుంది. పంటల కోత తర్వాత ధాన్యం ఆరబెట్టడానికి అటు మార్కెట్ యార్డులు, ఇటు కొనుగోలు కేంద్రాల్లో సరైన కల్లాలు లేక రైతులు అవస్థలు పడుతున్నారు. కనీస సదుపాయాలు లేక రోడ్డుపై ఆరబెడితే వర్షం పడినప్పుడు ధాన్యం తడిసి నీటి పాలవుతోంది. వాహనదారులకు ఇబ్బందులు తప్పడంలేదు. ఈ ఇబ్బందులను పరిష్కరించడానికి ఉపాధి హామీ ద్వారా పంట పొలాల వద్దే శాశ్వత కల్లాల నిర్మాణానికి ప్రభుత్వం పూనుకుంది. రైతులు, స్వయం సహాయక సంఘాల సభ్యులకు కల్లాల నిర్మాణాలకు అవకాశం కల్పించింది.

ప్రసిద్ధ కవి "పాటవెలదుల" సృష్టికర్త
డా॥ వద్దేపల్లి కృష్ణ
మరియు
నేటినిజం దిన పత్రిక
సంయుక్త ఆధ్వర్యంలో



ప్రతినెలా ఉత్తమ "పాట వెలదుల"కు బహుమతులు

ప్రతినెలా ఉత్తమ పాట వెలదుల్ని రచించిన రచయితలకు
ప్రథమ బహుమతి రూ.1,116/-
ద్వితీయ బహుమతి రూ.750/-
తృతీయ బహుమతి రూ.500/-లతో పాటు
ప్రశంసాపత్రం అందజేయబడును.

'పాట వెలదుల' లక్షణం: ప్రతిపాదంలో 4 పాదాల్లోనూ 5 సూర్యగణాలు (హంస పంచకం) ఉండాలి.

అంటే "ఆటవెలది"లో 2వ, 4వ పాదంలో పాటించే హంస పంచకాన్ని అన్నిపాదాల్లో పాటించాలి.

5 సూర్యగణాల మాత్రల నిడివి 15 మాత్రలు.
మాత్రాగణనం 'పాట' లక్షణం.

హంస పంచకం 'ఆటవెలది'లక్షణం.
ఈ వినూత్న పద్య ప్రయోగానికి "పాటవెలది" అని పేరుపెట్టనైనది.

'పాట వెలది' పద్య ఉదాహరణకు:
**"పల్లెలందు వీచు పైరగాలి**
**పట్నమందు లేచు పాడుగాలి**
**ప్రియముగాను మనిషి పీల్చుగాలి**
**కలుషితమ్ము ఆయె కర్మగాలి"**

ఇలా కనీసం **5 పద్యాల్ని** రచించి 'నేటినిజం' పత్రికకు ప్రతినెలా **20వ తేదీలోగా** పంపించాలి. ప్రతినెల నెలాఖరులో ఫలితాల్ని ప్రకటించి రచయితలకు బహుమతుల్ని **'నేటినిజం'** వేదికగా అందజేయడం జరుగుతుంది.

*సందేహాలకు డా॥ వద్దేపల్లి గారిని 9246541699లో సంప్రదించండి.*
రచనలు పంపవలసిన ఈమెయిల్:

**E-mail : netinizam2020@gmail.com**

# తడి, పొడిచెత్తను వేరు చేయడంపై అవగాహన పెంచాలి

## చెత్తతో సేంద్రియ ఎరువుల తయారీపై దృష్టి పెట్టాలి
## మాన్యువల్ ఆవిష్కరించిన మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు

హైదరాబాద్,జులై1(ఆర్ఎన్ఎ): ప్రతి ఊరుకో డంపు యార్డునిచ్చామని, ఆయా డంపు యార్డులు సాధ్యమైనంత వేగంగా నిర్మాణాలు జరగాలని పంచాయతీ రాజ్ శాఖ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు అన్నారు. చెత్తతో సేంద్రియ ఎరువుల తయారీని కూడా త్వరగా చేపట్టాలన్నారు. పల్లె ప్రగతిలో భాగంగా నిర్మిస్తున్న డంపు యార్డులు, తడి పొడి చెత్త నిర్వహణ, సేంద్రియ ఎరువుల తయారీపై పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ ప్రత్యేకంగా రూపొందించిన నియమావళితో కూడిన మాన్యువల్ ని హైదరాబాద్ లోని తన నివాసంలో మంత్రి విడుదల చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. చెత్త సేకరణ సమయం లోనే తడి, పొడి చెత్త వేరు కావాలి. ఆలా కాకపోతే, డంపు యార్డుల్లో కచ్చితంగా జరగాలన్నారు. అదే సమయంలో సేంద్రియ ఎరువుల తయారీని చేపట్టాలన్నారు. ఆ ఎరువులతో బంగారు పంటలు పండించా లని అధికారులను ఆదేశించారు. అధికారులకు సహకరించాల్సిందిగా సర్పంచ్‌లు, ప్రజా ప్రతినిధులకు సూచించారు. సీఎం కెసిఆర్ ఊరూరా డంపు యార్డులను మంజూరు చేశారన్నారు. ఆయా డంపు యార్డులను పల్లె ప్రగతి కార్యక్రమంలో భాగంగా నిర్మాణాలు చేపట్టామన్నారు. అయితే కొన్ని గ్రామాల్లో కొందరు ప్రజా ప్రతినిధులు, అధికారుల్లోనూ కొంత స్పష్టత రావడం లేదన్నారు. అందుకే పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ డంపు యార్డుల నిర్మాణాలు, తడి,పొడి చెత్త నిర్వహణ, సేంద్రియ ఎరువుల తయారీపై నియమావళిని సిద్ధం చేసిందన్నారు. ఈ నియమావళిని రాష్ట్ర వ్యాప్తంగా పంపిణీ చేస్తామన్నారు. కచ్చితంగా మార్గదర్శకాలు పాటించాలని అధికారులు, ప్రజా ప్రతినిధులకు సూచించారు. అలాగే డంపు యార్డులను వేగంగా పూర్తి చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ కార్యదర్శి సందీప్ కుమార్ సుల్తానియా, కమిషనర్ రఘునందన్ రావు తదితరులు పాల్గొన్నారు.

# నియంత్రిత సాగుతో మేలు: పద్మా

మెదక్,జులై1(ఆర్ఎన్ఎ): నియంత్రిత సాగు విధానంతో రైతులకు గిట్టుబాటు ధర అందుతుందని ఎమ్మెల్యే పద్మాదేవేందర్‌రెడ్డి అన్నారు. రైతులకు అవగాహన కల్పించడానికే రైతు వేదికలను ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. మొక్కలు నాటి పర్యావరణం కాపాడాలన్నారు. అభివృద్ధి పనులకు నిధుల కొరత లేదని, ఎక్కడా పనులు నిలిచిపోరాదని హెచ్చరించారు. నియోజకవర్గాన్ని అభివృద్ధి, సంక్షేమ రంగాల్లో జిల్లాలోనే అగ్రస్థానంలో నిలపాలని ఎమ్మెల్యే పద్మా దేవేందర్‌రెడ్డి అన్నారు. నియోజకవర్గంలో డంపింగ్ యార్డులు, వైకుంఠధామాలు, రైతువేదికలను త్వరి తగతిన పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. తడి, పొడి చెత్త వేరు చేయడంపై ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. ఇప్పటికే అన్ని గ్రామ పంచాయతీ లకు ట్రాక్టర్లు, ట్రాలీలు, ట్యాంకర్లను అందించామని స్పష్టం చేశారు. ఇప్పటి వరకు వైకుంఠధామాల పనులు ప్రారంభించని పలువురు సర్పంచులతో ఫోన్‌లో మాట్లాడి, వెంటనే ప్రారంభించాలని సూచించారు. జిల్లావ్యాప్తంగా డంప్‌యా ర్డుల నిర్మాణం పూర్తిచేయాలని అధికారులను ఆదేశించారు.

# సింగరేణి కార్మికుల్లో ధైర్యం నింపాలి: బీజేపీ

పెద్దపల్లి,జులై1(ఆర్ఎన్ఎ): కరోనా వైరస్ కారణంగా సింగరేణి కార్మికులు ఆందోళన చెందుతున్నారని, ప్రతి కార్మికుడికి పరీక్షలు చేయాలని బీజేపీ జిల్లా అధ్యక్షుడు వెరబెల్లి రఘునాథ్ డిమాండ్ చేశారు.ం రోజురోజుకు పాజిటివ్ కేసులు పెరుగుతున్నాయన్నారు. రాష్ట్రంలో ప్రభుత్వం పరీక్షలు తక్కువగా నిర్వహిస్తోందన్నారు. హైదరాబాద్ చెస్ట్ ఆసుపత్రి సౌకర్యాలపై కరోనా బాధితుడు పెట్టిన సెల్ఫీ వీడియోపై రాష్ట్ర ఆరోగ్య శాఖ మంత్రి ఈటల రాజేందర్ చేసిన వ్యాఖ్యలు బాధాకరమన్నారు. అతను తన బాధను వ్యక్తం చేస్తే తప్పుగా పరిగణించడం విచారకరమన్నారు. సింగరేణి ఏరియా ఆసుపత్రులను ఐసోలేషన్ కేంద్రాలుగా ఏర్పాటు చేసి కార్పొరేట్ స్థాయిలో వైద్యం అందించాల న్నారు. ముఖ్యమంత్రి సహాయనిధికి సింగరేణి యాజమాన్యం అందించిన రూ.40 కోట్లను కార్మికుల సంక్షేమానికి వినియోగించాలన్నారు.

# దోస్త్ రిజిస్ట్రేషన్ల నిలిపివేత

హైదరాబాద్,జులై1(ఆర్ఎన్ఎ): తెలంగాణ రాష్ట్రంలో కరోనా పాజిటివ్ కేసులు రోజురోజుకూ పెరుగుతున్న నేపథ్యంలో డిగ్రీ ఆన్‌లైన్ సర్వీసెస్ తెలంగాణ (దోస్త్) రిజిస్ట్రేషన్లను నిలిపివేశారు. ఈమేరకు రాష్ట్ర ఉన్నత విద్యామండలి కౌన్సిల్ అధికారులు వెబ్‌సైట్‌లో ప్రకటన చేశారు. జూన్ 22న దోస్త్ 2020 రిజిస్ట్రేషన్లను ప్రభుత్వం ప్రారంభించింది. షెడ్యూల్ ప్రకారం, డిగ్రీ కోర్సుల్లో మొదటి దశ ప్రవేశాలు జులై 1 నుంచి 14 వరకు, వెబ్ ఆప్షన్లు జులై 6 నుంచి 15 వరకు పెట్టుకునే విధంగా షెడ్యూల్ విడుదల చేశారు. జులై 22న సీట్ల కేటాయింపు జరుగనున్నట్లు పేర్కొన్నారు. కానీ ప్రస్తుతానికి వాయిదా వేశారు. త్వరలో రిజిస్ట్రేషన్ ప్రారంభ తేదీని ప్రకటిస్తామని దోస్త్ కన్వీనర్, రాష్ట్ర ఉన్నత విద్యామండలి చైర్మన్ ఆర్ లింబాద్రి తెలిపారు.

# జీవకోటికి చెట్లే జీవనాధారం

## మొక్కలతోనే మానవ మనుగడ
## పలుగ్రామాల్లో హరితహారంలో పాల్గొన్న మంత్రి హరీష్ రావు

సిద్ధిపేట,జులై1(ఆర్ఎన్ఎ): సర్వ జీవకోటికి చెట్లే జీవనాధారమని మంత్రి హరీష్‌రావు అన్నారు. బుధవారం జిల్లాలోని ములుగు మండలం సింగయాపెల్లిలో నిర్వహించిన ఆరవ విడత హరితహారం కార్యక్రమంలో మంత్రి పాల్గొని మొక్కలు నాటారు. మొక్కలు నాటడం అలవాటుకావాలన్నారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హరిత తెలంగాణగా మార్చడం ముఖ్యమంత్రి కేసీఆర్ సంకల్పం అని పేర్కొన్నారు. గాలి కాలుష్యంతో రకరకాల రోగాలు వస్తున్నాయని..మనిషి మనుగడకు ప్రమాదం వాటిల్లే అవకాశం ఉందన్నారు. ఆక్సిజన్ ఇచ్చే చెట్లను నాటినట్లయితే ఆరోగ్యవంతమైన మనిషిగా బ్రతకడానికి అవకాశం ఉందని మంత్రి హరీష్‌రావు తెలిపారు.

రాష్ట్రాన్ని హరిత రాష్ట్రంగా మార్చాలన్నదే సీఎం కేసీఆర్ లక్ష్యమని అన్నారు. గ్రామంలో చేపట్టిన హరితహారం కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ వెంకట్రామ రెడ్డితో కలిసి మొక్కలు నాటారు. జప్తి సింగాయపల్లి గ్రామంలో ఏక కాలంలో 2,500 మొక్కలు నాటారు.

మూడేళ్ల కింద చేపట్టిన ఎవెన్యూ ప్లాంటేషన్ చాలా బాగుందని చెట్లు సంరక్షించిన గ్రామ ప్రజాప్రతినిధులు, పంచాయతీ సిబ్బందిని మంత్రి అభినందించారు. అనంతరం క్షీరసాగర్ గ్రామంలో 10 వేల మొక్కలు నాటడం లక్ష్యంగా చేపట్టిన హరితహారం కార్యక్రమంలో మంత్రి పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ..తెలంగాణకు హరితహారంలో భాగంగా క్షీరసాగర్ గ్రామంలో మొక్కలు నాటామని, జిల్లాలో పెద్ద ఎత్తున మొక్కలు నాటాలన్నారు.

గజ్వేల్ నియోజకవర్గంలో ఇప్పటికే చాలా బాగా హరితహారం కార్యక్రమాన్ని చేపట్టారని, మొక్కలు నాటడమే కాదు, నాటిన మొక్కలను సంరక్షించడం ముఖ్యమని మంత్రి తెలిపారు. హరిత ఉద్యమంలో ప్రజలంతా స్వచ్ఛందంగా పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

జిల్లాలోని అన్నీ గ్రామాలలో ఊరురా పల్లె ప్రకృతి వనాలు, ప్రతీ గ్రామంలో డంప్, గ్రేవ్ యార్డులు ఉండాలన్నదే సీఎం కేసీఆర్ లక్ష్యమని పేర్కొన్నారు. గ్రామంలో నిర్మించిన డంప్, గ్రేవ్ యార్డులు ప్రజలకు ఉపయోగపడేలా.. వినియోగంలోకి తేవాలని అధికారులకు సూచించారు. ఈ మేరకు క్షీరసాగర్ గ్రామంలోని రామాలయంలో ప్రత్యేక పూజలు చేశారు. ఆ తర్వాత రూ.6 లక్షల వ్యయంతో పల్లె ప్రకృతి వనం, రూ.15 లక్షల వ్యయంతో కూరగాయల మార్కెట్ నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశామని తెలిపారు. మంత్రి వెంట జెడ్పీ చైర్ పర్సన్ వేలేటి రోజా శర్మ, ఎఫ్‌డిసి చైర్మన్ వంటేరు ప్రతాప్ రెడ్డి, గడ ప్రత్యేక అధికారి ముత్యంరెడ్డి, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

Printed, Published and owned by VEENADAS,at Freedom Publications, SRT-74, Jawahar nagar, Ashok nagar, Hyderabad-500 020, Telangana.
Published at SRT-74,Jawahar nagar, Ashok nagar, Hyderabad-500020. Telangana. 'Editor: B. Devadas, Ph.No.040- 2766 2477.
**RNI No.52865/93.** E-mail :netinijam93@gmail.com